జన రాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 23 పక్షపత్రిక డిసెంబర్ 1-15, 2016



# రాజకీయ, పాలనా వ్యవస్థలపై ప్రజలూ మొదలెట్టాలిక

# సర్జికల్ దాడులు!






జైపూర్‌లోని మణిపాల్ యూనివర్సిటీలో జరిగిన మీడియా ఫెస్టివల్ 'ప్రజాస్వామ్యం లో బాధ్యతాయుత జర్నలిజం' పై లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విద్యార్థులతో ఆలోచనల్ని పంచుకున్నారు.



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక డిసెంబర్ 1-15, 2016

సంపుటి - 7 సంచిక - 23

## లోపలి పేజీల్లో...

రాజకీయ, పాలనా వ్యవస్థలపై........... 5
మోదీగారూ, నేను ట్యాక్స్ ఎందుకు ..... 13
సాహసోపేత నిర్ణయం.....................15
పెద్ద నోట్ల రద్దుతో పాటు చేయాల్సిన... 16
దాడుల్లో గుర్తించిన నల్లధనం ........... 17
లంచాలు రూ. కోటి కోట్లపైనే............ 18
ఆశ్రిత పెట్టుబడికి అడ్డుకట్ట వేయటం.... 19
మోదీ, సీఎంలను మించిన ............... 21
ప్రజాప్రతినిధులకు గుణపాఠం............ 23
ఈ ప్రశ్నలకు సమాధానాల మీదే మన... 24
ఇంకా దండిగానే హుండీ నిధులు....... 27
విద్యావ్యవస్థలో మార్పు కోసం........... 29
విద్యార్థుల సంఖ్యను బట్టే ప్రభుత్వ...... 30
జస్టిస్ కట్జూకి నోటీసివ్వటం స్వేచ్ఛను... 33
ప్రియమైన పవన్ కళ్యాణ్ గార్కి........... 34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు


బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# ఔనంటే కాదనటం, కాదంటే ఔననటం



మన రాజ్యాంగాన్ని మార్చాలని ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో పలువురు ఉదారవాద ఆలోచనాపరులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ప్రజలందరికీ సమానంగా ఎదిగే అవకాశాలనిస్తూ వారిలోని అంతర్గత సామర్థ్యాన్ని వెలికితీసేందుకు.. శాంతిభద్రతల పరిరక్షణ, చట్టబద్ధ పాలన, మౌలిక వసతులు, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటి మౌలికాంశాలకే పరిమితం కావాలని, మిగిలినదంతా ప్రజల స్వేచ్ఛకే వదిలేయాలని బలంగా నమ్ముతాను కాబట్టి ఆ చర్చకు హాజరయ్యాను. కానీ రాజ్యాంగాన్ని తిరిగి రాయాలన్న వాదనను తోసిపుచ్చాను. రాజ్యాంగ రచనో, మరో ఉమ్మడి లక్ష్యమో ఎంత గొప్పదైనా దాన్ని సాధించే దిశగా కలిసిపనిచేయటానికి మన సమాజం ఈవేళ సిద్ధంగా లేదు. ఇలాంటప్పుడు రాజ్యాంగాన్ని తిరిగి రాయాలనుకోవటం అజ్ఞానమన్నా అవుతుంది, ప్రమాదకర ఆలోచనైనా అవుతుంది. మన రాజ్యాంగం మౌలికంగా మన అవసరాలకు, మన ఉజ్వల భవిష్యత్తుగా తగిన రీతిలోనే ఉండేలా పెద్దలు రూపొందించారు కాబట్టి రాజ్యాంగాన్ని మెరుగుపరచవచ్చు, విస్తృతపరచవచ్చు, రాష్ట్రాల స్థాయికి వికేంద్రీకరించవచ్చు తప్ప తిరిగి రాయనక్కర్లేదని నిశ్చితాభిప్రాయం కూడా ఉండటంతో.. ఏకాభిప్రాయ సాధన ఎలా అనే చర్చను నేను పెద్దగా పొడిగించలేదు. కానీ రాజ్యాంగం పరిధిలోని మిగతా అంశాలలోకొస్తే ఆ చర్చ ఈవేళ అనివార్యంగా పరిష్కరించాల్సిన సమస్య. దశాబ్దాలుగా దేశాన్ని పట్టిపీడిస్తున్న నల్లధనం, నకిలీనోట్లపై యుద్ధం విషయంలో రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్న తీరునే తీసుకుంటే.. ఎంతో అవాంఛనీయ ధోరణి కనిపిస్తోంది. కేంద్రీకృత వ్యవస్థలో అధికారం, ప్రచారంలో మజాని ఆస్వాదిస్తూ పాలకులు మైమరచి వుంటే ఏం జరుగుతుందో పెద్ద నోట్ల రద్దు అమలులో తలెత్తిన సంక్షోభ పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి. భారత్ వంటి దేశంలో కరెన్సీ నోట్లను కదిలించటాన్ని ముతక వ్యూహంగానే భావించాలి. కానీ చాలా సాహసోపేత నిర్ణయం. ఇంత నిర్ణయాన్ని సదుద్దేశంతో తీసుకున్నప్పుడు, దాన్ని వెనక్కి తీసుకోవటం కన్నా ముందుకు తీసుకెళ్లటమే మేలైనప్పుడు ప్రతిపక్షాలు ఏం చేయాలి? వ్యాపారాలు, రోజువారీ ఉపాధి దెబ్బతినటం, నోట్ల కొరత వంటి ఇబ్బందుల్ని ప్రజలకు తగ్గించేందుకు చర్యల కోసం డిమాండ్ చేస్తూనే.. నల్లధనం అంతానికి చేపట్టాల్సిన ఇతర సంస్కరణల కోసం పట్టుబట్టాలి. కానీ మోదీ ప్రభుత్వం చేసిన నోట్ల రద్దును వ్యతిరేకిస్తున్న ప్రధాన పార్టీలు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో చర్చంతా నోట్ల రద్దు చుట్టూనే తిరుగుతూ.. నల్లధనం అంతానికి నోట్ల రద్దు సక్రమంగా అమలుచేయటమే అంతిమ పరిష్కారమని ప్రజలు భ్రమపడేలా చేస్తోంది. రాజకీయ పార్టీల మధ్య అగాధం విధానపరంగా దేశానికి తీవ్ర నష్టం కలిగిస్తోంది. అమెరికా తాజా ఎన్నికల్ని మనమింకా మర్చిపోలేదు గదా! ఒకరు చేసిన పనిని వ్యతిరేకించటమే రెండో పార్టీ పని అనే రాజకీయాన్ని పెంచి పోషించటంతో విద్వేష, వివక్ష భావాలను రెచ్చగొట్టే డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికవటాన్ని అమెరికాలో ఎవరూ ఆపలేకపోయారు. ఆయన ఓడినా గెలిచినట్టే అనే పరిస్థితి ఏర్పడింది. ట్రంప్ నాటకీయంగా ఈ వ్యూహాన్ని అమలు చేశారా, మరోటా అనేది పక్కనపెడితే, ఇలాంటి దిగజారుడు రాజకీయానికి అమెరికాలాంటి ఆధునిక ప్రజాస్వామిక దేశం స్పందించటానికి కారణం- రాజకీయ పార్టీల మధ్య శత్రుత్వం పెరిగిపోవటం! అమెరికా ప్రజల్ని అంతలా నిలువునా చీల్చేశాయి అక్కడి పార్టీలు. అమెరికా రాజకీయ వైఫల్యాన్ని చూసి కూడా మనం నేర్చుకోవటం లేదు. మన దేశంలోని ప్రాచుర్య పార్టీల నేతల్లో పలువురు నల్లధనం-తెల్లధనం లావాదేవీలు, నల్ల బంగారం-తెల్ల బంగారం కమీషన్లలో కలిసిమెలిసే ఉంటారు. ఆ పార్టీల విధానాల మధ్య తేడా కూడా ఏమీ ఉండదు. కానీ ఎలాగోలా అధికారంలోకి రావటం కోసం ప్రజల్లో చీలిక తెచ్చేందుకు ఆ పార్టీలు తీవ్ర శత్రుత్వాన్ని ప్రదర్శిస్తుంటాయి. కొందరు నిజాయతీపరులున్నా ఆ ఊబిలో కూరుకుపోయి వుంటారు. ఒక్కో ఎన్నికకు ఒక్కో అంశాన్ని తెరమీదికి తెస్తుంటారు. అధికారంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన అంశాన్ని ప్రతిపక్షంలో సమర్థిస్తారు, ప్రతిపక్షంలో వ్యతిరేకించిన అంశాన్ని అధికారంలోకి వెళ్లాక సమర్థిస్తారు. అణు ఒప్పందం నుంచి ఎఫ్‌డీఐలు, జీఎస్టీ వరకు ఎన్నో ఉదాహరణల్ని ఇందుకు చెప్పుకోవచ్చు. ఈ శత్రుత్వ ధోరణి, రెండు నాల్కల వైఖరి వల్ల ఇప్పుడు నల్లధనం నిర్మూలన విషయంలో ఈదేశానికి సరైన రోడ్‌మ్యాప్ కరువవుతోంది. ప్రభుత్వం చేసిన తప్పుల్ని ఎండగడుతూనే తమ దగ్గరున్న ప్రత్యామ్నాయం ఏమిటో ప్రతిపక్షాలు వెల్లడించాలి. పార్లమెంటులోపల, బైటా ఈ పని చేయాలి. మోదీ ప్రభుత్వం కూడా నోట్ల రద్దును సర్వరోగనివారిణిగా ప్రచారం చేసుకోవటం మాని, నల్లధనం నిర్మూలనకు చేపట్టాల్సిన ఇతర సంస్కరణల్ని స్పష్టతతో చేపట్టాలి. నల్లధనం అనేది పన్నులు ఎగ్గొట్టటం వల్ల పోగుపడుతుంది కాబట్టి, పన్నులే ఆధునిక ప్రజాస్వామిక ప్రభుత్వాలకనిర్వహణకు ఆధారం కాబట్టి.. ఈ మొత్తంలో కీలకమైన పన్నుల సంస్కరణల్ని అమలుచేయాలి. పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో ఆదాయం పెరుగుతోంది కనుక పన్నుల్ని తగ్గించాలి. పౌర సేవల చట్టం, వార్డు స్థాయి వరకు తలసరి కేటాయింపు వంటి చర్యలతో పన్నులకు తగ్గ సేవలు అందించాలి. నల్లధనానికి మూలమైన రియల్ ఎస్టేట్ రంగంలో స్టాంప్ డ్యూటీలు తగ్గింపు, భూముల విలువ పెంపు వంటి మార్పులు చేయాలి. ఇలా లోక్‌సత్తా తొలి నుంచీ చెబుతున్నట్టు "తాము పట్టే పన్నులకు-తమ ఓటుకు సంబంధం" ప్రజలకు అర్థమయ్యేలా చేయాలి. ఇక మనదేశంలో నల్లధనానికి, అవినీతికి అవినాభావ సంబంధం ఉంది కాబట్టి, అవినీతి నిరోధక వ్యవస్థల్ని బలోపేతం చేయాలి. అన్నిటికంటే ముఖ్యంగా నల్లధనాన్ని పెంచి పోషిస్తున్న ఓట్ల కొనుగోలు ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు దామాషా పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత వంటి చర్యల్ని తీసుకురావాలి. ఇవి చేయకుండా అధికార పక్షం, ప్రతిపక్షాలు నాటకాలాడటం నేరసమాన తప్పిదం. "హేతుబద్ధ చర్చే ప్రజాస్వామ్యం, దేశ ప్రయోజనాల కోసమే ఎన్నికలు, చట్టసభలు". పార్టీలు ఈ గీతలు దాటకుండా ప్రజలు, ముఖ్యంగా యువత ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి.

మీ






## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

## ట్యాక్స్‌లకు తగ్గ సేవలు, అవినీతి అంతానికి వ్యవస్థలు, ఎన్నికల సంస్కరణలు, విద్య, ఆరోగ్యం, స్థానిక సాధికారత తొలిదశ లక్ష్యంగా..

# రాజకీయ, పాలనా వ్యవస్థలపై భారత ప్రజానీకమూ మొదలెట్టాలిక సర్జికల్ దాడులు!

అందరూ మనలాంటి వాళ్లే,

అందరికీ సమానావకాశాలు అందాలి,

అన్ని మతాల సారాంశమూ ఇదే... అని అర్థమైతే మనం గొప్ప ప్రజాస్వామ్యవాదులమైపోయినట్టే.

ప్రజాస్వామ్యం అంటే ప్రజలు ప్రభువుల్లా వ్యవహరిస్తుండాలి, పాలకులు సేవకుల్లా వ్యవహరిస్తుండాలి. ఏ ప్రజాస్వామ్యానికైనా అత్యుత్తమ గ్యారంటీ – ఇలాంటి అవగాహన, సాధికారత కలిగిన ప్రజలే!

ప్రజలు పౌరసత్వంతో, నాయకత్వంతో వ్యవహరించగలగాలంటే.. వారి చైతన్య స్థాయికి తగ్గట్టు ముందుచూపుతో వ్యవస్థలను నిర్మించాలి. ఉదాహరణకి, ఎంతో సంక్లిష్ట భిన్నత్వం వున్న మనదేశంలో పౌరసత్వం, నాయకత్వం తప్పుడు రాజకీయం, పాలనా పద్ధతుల వల్ల అవసరమైన స్థాయిలో తయారుకాలేదు కాబట్టి ఇక్కడ అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందిస్తూనే వార్డు, గ్రామస్థాయి వరకూ అధికారాన్ని వికేంద్రీకరించటం, మంచిపార్టీకి, అభ్యర్థికి వేస్తే



అలాంటి సత్తా గలిగిన ప్రజలుంటే అది పౌర+సత్వం=పౌరసత్వం కలిగిన దేశమవుతుంది.

పౌరసత్వం ఉంటే మన ఓటు, భావప్రకటనా స్వేచ్ఛ, స్వతంత్ర సంఘాలుగా ఏర్పడి మనం చేసే కార్యక్రమాలు పాలకుల్ని, ప్రభుత్వ ఉద్యోగులను చక్కగా అదుపుచేస్తూ సేవకుల్లా పనిచేయిస్తుంటారు. ప్రజలు పౌరసత్వంతో వ్యవహరించేలా చేసేందుకు కావలసిన వ్యవస్థల్ని నిర్మించటమే గొప్ప ప్రజాస్వామిక నిర్మాణం.

నా ఓటు వేస్టు కాదు అనే భావన కలగడానికి దామాషా ఎన్నికల పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణలు తక్షణావసరం. దీనివల్ల ప్రజల్లో స్వతంత్ర జీవనం, ఆత్మవిశ్వాసంతో కూడిన అవగాహన పెరగటంతోపాటు పాలనలో వారు భాగస్వాములవుతూ పౌరసత్వాన్ని, నాయకత్వాన్ని పెంపొందించుకోగలుగుతారు. అందుకే ఇతరత్రా ఇంకా అనేకం అవసరమున్నా భారత్‌లో ఈ సంస్కరణలకు తక్షణ ప్రాధాన్యతనిస్తూ లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా పోరాడుతోంది.



ఈ పోరాటంలో భాగంగానే.. 'రాజకీయ పార్టీలకు సొంతంగా బలమంటూ ఉండదు, ప్రజలు ఓటు వేస్తేనే అవి పెద్ద పార్టీలవుతాయి, మీరు ధైర్యంగా మంచి రాజకీయానికి, అభ్యర్థులకు ఓటు వేస్తే రాజకీయం రాత్రికి రాత్రి మారిపోతుందని' లోక్‌సత్తా ఎన్నోసార్లు చెప్పింది. అయితే మెజారిటీ ప్రజలకు ధైర్యం చాలలేదు. రాజకీయాల్ని మార్చలేమన్న నిరాశ, రాజకీయ నేతలు, చుట్టూ ఉండే ప్రభుత్వోద్యోగుల పట్ల భయం, ప్రభుత్వంలో ఎవరు గెలిచినా తమకు ఏమీ జరగదనే అనుమానం వంటివి కలగలిసి వారిని ఉన్న దోపిడీ పార్టీలలోనే చిన్న రాక్షసులను ఎన్నుకునేలా చేస్తున్నాయి. దీనివల్ల వారి పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టే అవుతోంది. లోక్‌సత్తా, ఆ స్ఫూర్తితో వచ్చిన ఇంకొందరు ఎంత ప్రయత్నం చేస్తున్నా వనరులు పరిమితంగా ఉండటంతో, సమాజం నుంచి పెద్దగా నాయకత్వాన్ని అందించే స్పందన కూడా లేకపోవటంతో ప్రచారం పరిమితంగానే జరుగుతూ మార్పులు ఆలస్యమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంస్కరణల దిశగా భారత ప్రజానీకానికి ధైర్యాన్నిచ్చే ఒక పెద్ద సంఘటన– చెలామణిలో వున్న రూ. 500, రూ. 1000 నోట్లను వెనువెంటనే రద్దుచేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నవంబర్ 8, 2016 రాత్రి చేసిన ప్రకటన.

పాకిస్తాన్ సైన్యంపై ప్రతీకారంగా చేసిన దాడి గురించి చెప్పలేంగానీ, నల్లధనాన్ని, నకిలీనోట్లను వదిలించేందుకు మోదీ ప్రభుత్వం చేసిన పెద్దనోట్ల రద్దు కార్యక్రమాన్ని మాత్రం సానుకూల సర్జికల్ దాడిగా చెప్పుకోవచ్చు. ప్రజలకు ప్రత్యామ్నాయంగా నోట్లను వెంటనే తగినంతస్థాయిలో అందుబాటులోకి తేలేకపోవటం, మళ్లీ నల్లధనం, నకిలీనోట్లు పోగుపడకుండా చర్యలేమిటో తేల్చి చెప్పలేకపోవటం, ఇవేమీ చెప్పకుండానే మళ్లీ పెద్ద నోట్లు కొత్తవి ప్రవేశపెట్టటం, కొంత నల్లధనం తప్పించుకోవటం, ప్రతికూల ద్రవ్యోల్బణం, ఎక్కువ వడ్డీల ఎరతో చిట్‌ఫండ్‌ల వంటి ప్రయివేటు మోసాలు పెరిగే అవకాశం, ఆన్‌లైన్ ఆర్థిక వ్యవస్థ కోసం మితిమీరిన దూకుడు వంటి సమస్యలున్నా, ముఖ్యమంత్రి స్థాయి వారు సహా కొంతమంది వ్యక్తులు దొరక్కుండా నలుపును తెలుపుగా మార్చుకుంటున్నారన్న వార్తలు వినిపిస్తున్నా.. ఈ మెరుపుదాడిని తప్పుపట్టలేం.

వాస్తవానికి నల్లధనంపై సర్జికల్ దాడిని నోట్ల రద్దుతో మొదలుపెట్టటాన్ని ఒక ముతక చర్యగానే భావించాలి. పరిణతిగల ఆధునిక నాయకులెవరూ, ముఖ్యంగా భారత్ వంటి దేశంలో కరెన్సీ నోట్లను కదిలించటం వంటి చర్యలకు పోరు అని అందుకే కొన్నేళ్ల క్రితం ఇదేరకమైన రీతిలో 'అర్థక్రాంతి' ప్రతిపాదన వచ్చినప్పుడు కూడా జేపీ వ్యాఖ్యానించారు. నోట్ల రద్దు అనేది ఒక సాధారణ ద్రవ్య కార్యక్రమంలాగా అమలయ్యేలా నల్లధనంపై దాడులుంటే అది పర్‌ఫెక్ట్ స్ట్రయిక్ అయివుండేది. అయినా అందరినీ కదిలించాలి అనే సదుద్దేశంతో మెరుపుదాడిలా చేయటాన్ని మనం తప్పుపట్టనక్కర్లేదు, దాంతోపాటు దశాబ్దాలపాటు నల్లధనం, అవినీతిలో కూరుకుపోయిన దేశాన్ని వాటిపై పోరాటం దిశగా సన్నద్ధం చేయటానికి ఇలాంటి సంచలనం కొంత ఉపయోగపడుతుంది కాబట్టి లోక్‌సత్తా సమర్థించింది. నల్లధనం కొన్ని లక్షల కోట్లయినా బైటపడటం, మాదక ద్రవ్యాల్ని, ఉగ్రవాదాన్ని సైతం పెంచుతున్న నకిలీ నోట్లు వేగంగా పోవటం జరగాలంటే ఇలా సర్జికల్ దాడే చిట్టచివరి అస్త్రం. మనదేశంలో నల్లధనానికి, అవినీతికి దగ్గర సంబంధాలు ఉంటాయి కాబట్టి.. దీన్ని అవినీతి మీద కూడా మెరుపుదాడిగానే భావించాలి. దీని వల్ల మిగతా అంశాలను పక్కనబెడితే అతి పెద్ద ప్రభావం– ప్రజలను పెద్దఎత్తున కదలించటం! తరతరాల స్తబ్దత నుంచి ఇండియన్ సైక్‌ని కుదిపేయటం!!

మారుమూల గ్రామాల వరకు కూడా ప్రజలు ఒక్కసారిగా కదలాల్సి వచ్చింది.

దీర్ఘకాలంలో.. ప్రజలు తమ మనసుల్లో కోరుకుంటున్న లక్ష్యాలను సాధించేలా పెద్ద ధైర్యాన్నిచ్చే భారీ ఘటన ఇది. రాత్రికి రాత్రి పరిస్థితి మారిపోయింది. నిన్నటి వరకూ

అపురూపంగా, దైవసమానంగా వున్న రూ.500, 1000 నోట్లు రాత్రికి రాత్రి తెల్లకాగితాలుగా మారిపోయాయి. ఇంత పెద్ద షాక్ ట్రీట్‌మెంట్‌కి ఎంత ధైర్యంతో చేసిన మెరుపుదాడి ఇది! తన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలలో 98శాతం దాకా అక్రమ డబ్బు ఖర్చు పెట్టి ఎన్నికైన వాళ్లేనని, తమకు ఫండింగ్ ఇచ్చే వాళ్లలో నల్లడబ్బు వెనకేసుకునే వ్యాపారులే ఎక్కువని తెలిసినా కూడా ప్రధానమంత్రి ఈ ధైర్యం చేయగలిగారు. రాజకీయంగా, పాలనాపరంగా తనకున్న తిరుగులేని అధికారంతో మోదీ ఈ పని చేయగలిగారు. కానీ కొన్ని లోపాలు, భవిష్యత్తు పట్ల ఇంకా నమ్మకం కలిగించలేని విధానాల వల్ల మోదీ చేసిన ఈ దాడి పర్‌ఫెక్ట్ స్ట్రయిక్ కాలేకపోయింది. అదే.. ఈ లోపాలు, గందరగోళం లేకుండా ప్రజాస్వామ్యంలో మోదీ కన్నా కూడా శక్తిమంతులైన ప్రజలు ఈరకంగా రాజకీయ, పాలనా వ్యవస్థల మీద సర్జికల్ దాడులు చేస్తే?..




రాజకీయం, పాలనా వ్యవస్థలపై ప్రజలు ఇలాంటి మెరుపుదాడులు చేయటానికి ఎటువంటి లోపాలు, గందరగోళం లేని ఎజెండాను లోక్‌సత్తా అందించినా, ప్రోత్సహించినా.. పరిమితవనరుల మధ్య లోక్‌సత్తా చేస్తున్న ప్రచారం వల్ల ప్రజలు ధైర్యం చేయలేకపోయారు. కానీ అధికార బలగాలను, వనరులను ఉపయోగించుకుని మోదీ చేసింది చూశాకైనా ప్రజలు ఇందుకు చొరవ చూపితే?.. ఖచ్చితంగా రాజకీయ, పాలనా వ్యవస్థలు సమూలంగా మారిపోతాయి. మోదీ ఎదుర్కొన్న తరహాలో సమస్యలేవీ తలెత్తకుండానే గొప్ప విజయం ఈదేశానికి సొంతమవుతుంది.

భారతదేశ ప్రజలు తమకున్న ఓటు హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ, స్వతంత్ర సంఘాలుగా ఏర్పడే హక్కును వినియోగించుకుని తమదైన రీతిలో సర్జికల్ దాడికి దిగటానికి ఇక ఏమాత్రం వెరవకుండా సన్నద్ధం కావాలి.


అయితే ప్రజలు తమ సర్జికల్ దాడి చేయడానికి తగిన ప్రణాళిక/ఎజెండాను సిద్ధం చేసుకోవాలి. రాజకీయ నాయకులను, పాలనా వ్యవస్థను ఏమి అడగాలో, వారి నుంచి ఏమి సాధించుకోవాలో స్పష్టంగా గుర్తెరగాలి.

మోదీ సర్జికల్ స్ట్రయిక్ వెనక ప్రధానాంశం నల్లధనం, దాని చుట్టూ జరిగే అవినీతిని అంతం చేయటం. అవినీతి అంతానికి మనదేశంలో ఎన్నో ఉద్యమాలు జరిగినా ఇంకా అది నినాదంగానే కొనసాగుతోంది తప్ప విధానాల స్థాయికి చేరుకోలేదు. డిసెంబర్ 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినంగా 2003లో ఐక్యరాజ్యసమితి చేసిన ప్రకటనను ఆమోదించినా, అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక డిక్లరేషన్‌పై సంతకాలు చేసినా, పేదలను దెబ్బతీసే, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచే అవినీతికి వ్యతిరేకంగా పోరాడతానని ప్రతిజ్ఞ చేసినా.. మనదేశంలోని ప్రభుత్వ కార్యాలయాలలో, రాజకీయాలలో అవినీతి తగ్గలేదు, విదేశీ ఖాతాలకు లక్షల కోట్ల నల్లధనం తరలిపోవటమూ ఆగలేదు. అవినీతి అంతానికి కేవలం నినాదాలతో కాకుండా స్పష్టమైన విధానాలతో పోరాటానికి లోక్‌సత్తా 1997లో నాంది పలికింది. బహుశా భారతదేశంలో డిసెంబర్ 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినాన్ని జరపటం ప్రారంభించిన పార్టీ లోక్‌సత్తాయే. ఇప్పుడు సర్జికల్ దాడులకి మొదటి అంశంగా.. 'అందరికీ ఎదిగే అవకాశాలుండే అవినీతి రహిత సమాజాన్ని సాధించాలనే' లక్ష్యాన్ని ప్రజలు ఎంచుకుంటే చాలా పెద్ద మార్పుకి నాంది పలికినవారవుతారు. ఈ దాడి సరైన దిశలో సాగాలంటే.. అవినీతి అంతానికి ఏం చేయాలో ముందు స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

తక్షణం చేయాల్సింది– మోదీ సర్జికల్ స్ట్రయిక్‌ని సరైన మార్గంలోకి తీసుకెళ్లేలా చేయటం! అంటే, నల్లడబ్బు మళ్లీ రాకుండా ఏం చేయాలో అది మోదీ కచ్చితంగా ఆచరించేలా ప్రజలు చేయాలి.. ఇందుకోసం మోదీ చేత ఏం చేయించాలో చూడండి.

నల్లడబ్బు అంటే ప్రధానంగా పన్నులు చెల్లించకుండా

ఉన్న డబ్బు. కానీ ఇలా పన్నులు ఎగ్గొట్టేవారందరూ మనదేశంలో దోషులనటం సహించరానిది. అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల అని తేడా లేకుండా దాదాపు అన్నిటిమీదా ప్రత్యక్షంగా, పరోక్షంగా పన్నుల డబ్బు వసూలు చేస్తున్న ప్రభుత్వం ఆ డబ్బుతో ప్రజలకు అందించాల్సిన రక్షిత మంచినీరు, సరైన రోడ్లు, విద్యుత్తు, విద్య, ఆరోగ్యం, లంచాలు లేని సేవలు, చట్టబద్ధ పాలన, అందరికీ సమన్యాయం అందించకుండా పాలకుల జల్సాలకు, ప్రభుత్వోద్యోగుల భారీ జీతాలకు ఆ డబ్బును తగలేస్తుంటే ప్రజలు ఎందుకు పన్నులు కట్టాలి? రియల్ ఎస్టేట్‌లో అంతంత స్టాంప్ డ్యూటీలు పెట్టి క్యాష్ ఇవ్వకపోతే లావాదేవీలు చేయం అనే పరిస్థితిని తెస్తే.. ఇక్కడ క్రిమినల్ ప్రజలా? ప్రభుత్వమా?.. నల్లధనం మీద యుద్ధం చేస్తానంటున్న ప్రభుత్వం ముందు ప్రజలు కట్టే పన్నులకు తగ్గ సేవలను అందించాలి. 'నేను కట్టే ప్రతి పైసా నాకు, ఈ దేశానికి ఉపయోగపడుతుంది' అనుకున్నప్పుడు పన్నులు కట్టటానికి ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వస్తారు. అవినీతితో నల్లడబ్బు సంపాదించేవారు, నల్లడబ్బును అవినీతి కోసం వినియోగించేవారిని పక్కనపెట్టి.. ప్రభుత్వం మీద నమ్మకం లేక పన్నులు ఎగ్గొట్టి తామే ఆ డబ్బును ఖర్చుపెడుతున్న అత్యధిక ప్రజానీకాన్ని దోషులుగా ముద్రవేయకుండా ప్రభుత్వం తక్షణం పన్ను సంస్కరణల్ని చేపట్టాలి. రియల్ ఎస్టేట్ రంగంలో ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలు చేస్తున్న తప్పిదాలకు ఇప్పుడు పెద్దనోట్ల రద్దుతో ఇబ్బందులు పడుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఏదోక తక్షణ మినహాయింపుతో వారి డబ్బులకు గ్యారంటీ చూపిస్తూ, రోజువారీ వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు దెబ్బతిన్న వారికి అవకాశాల్ని పెంచే తక్షణ ఉపశమనాల్ని అందిస్తూ.. ప్రభుత్వం ఈ పన్ను సంస్కరణల్ని మొదలుపెట్టాలి.




మోదీ మొట్టమొదటి చర్యగా చేపట్టాల్సిన పన్ను సంస్కరణల్లో భాగంగా పన్నుల్ని తగ్గించాలి, దాంతోపాటు వసూలు చేసిన పన్నులకు తగ్గ సేవలను అందించాలి.

**1) పన్నుల్ని తగ్గించాలి:** నల్లడబ్బు మళ్లీ రాకుండా ఉండాలంటే పన్ను సంస్కరణల్లో భాగంగా పన్నుల్ని తగ్గించాలి.

పెద్దనోట్లను హఠాత్తుగా రద్దు చేయడం వల్ల మున్ముందు నల్లధనం పోగేసుకునే రిస్కు తీసుకునే వారు తగ్గుతారు. ప్రభుత్వం ఆశించినట్టు ఆన్‌లైన్ లావాదేవీలు పెరుగుతాయి. దీనివల్ల ప్రభుత్వాలకు ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ఆదాయం బాగా పెరుగుతుంది. అలాగే పెద్ద నోట్ల రద్దు వల్ల బ్యాంకు ఖాతాల్లోకి చేరిన లక్షల కోట్లు జమ అవుతాయి. కాబట్టి కొంతడబ్బును నిరుపేదల ఖాతాల్లో వేయటంతోపాటు దేశప్రజలందరికీ పన్నుల్ని తగ్గించాలి. దీనివల్ల నల్లధనానికి కీలకమైన రియల్ ఎస్టేట్ రంగంలో కూడా ప్రక్షాళన జరుగుతుంది. ఈరంగంలో పన్నులు విపరీతంగా ఉండటంతో ప్రజలు స్థిరాస్తి అమ్మినా, కొన్నా లెక్కలు చూపని నగదు లావాదేవీలు చేయాల్సి వస్తోంది. ఎవరైనా చిత్తశుద్ధితో లెక్క చూపుదామనుకున్నా అవతలివారు ఒప్పుకోరు. స్టాంప్‌డ్యూటీ తగ్గించి భూమి విలువను పెంచితే ప్రజలకు మేలు జరగటంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి కూడా ఢోకా ఉండదు. రియల్ ఎస్టేట్‌తోపాటు ఇతర అన్ని రంగాలలో పన్నుల్ని తగ్గిస్తే చెల్లించేవారు గణనీయంగా పెరుగుతారు.

కావాలంటే, కొంత ఆదాయపరిమితి పెట్టి ఆపైన డబ్బున్నవాళ్లకి ఎక్కువ పన్నులు విధించొచ్చు. తీవ్ర ఆదాయ అసమానతలున్న మనదేశంలో ఇలాంటి ఏర్పాట్లను పన్నుల వ్యవస్థలో భాగం చేయటం అవసరం.

**2) పన్నులకు తగ్గ సేవల్ని అందించాలి:** ఇంతకుముందే అనుకున్నట్టు, ప్రజలు ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టటం పెద్ద తప్పు కాదు అనుకోవటానికి కారణం– ప్రభుత్వం పనితీరు మీద నమ్మకం లేకపోవటం! లంచాలకు తోడు పన్నులు కూడా ఎందుకు దండగ అనుకునేవారు కోట్ల మంది ఉన్నారు. పాలకులు విలాసవంతంగా తిరగడానికి, లంచావతార ప్రభుత్వోద్యోగులకు లక్షకోట్లకు పైగా జీతాలు పెంచటానికి పన్నుల డబ్బులు ఉపయోగిస్తుంటే ప్రజలెందుకు కట్టాలి? అమరావతిలో ఉండే ఏపీ ముఖ్యమంత్రి హైదరాబాద్‌లో రూ. 10కోట్లతో క్యాంప్ ఆఫీస్‌కి నగిషీలు చెక్కించుకోవటానికి, అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ తరహాలో తెలంగాణ ముఖ్యమంత్రి నివాస భవనాల్ని నిర్మించుకోవటానికి కాదు గదా ప్రజలు పన్నులు కడుతున్నది?.. కాబట్టి ముందు ప్రజల పన్నుల డబ్బు సద్వినియోగమవుతుంది అనే సంస్కరణల్ని ప్రభుత్వం అమలు చేయాలి.

రూ. 500, 1000 నోట్లు రద్దు చేశాక, వస్తు రూపంలోనో, మరో కొత్త రూపంలోనో ఉద్యోగులు ప్రజల నుంచి లంచాలు గుంజుతారు. నోట్ల రద్దు తర్వాత చాలా ప్రభుత్వ కార్యాలయాలు వెలవెలబోవటం యథాలాప అంశం కాదు. కొత్త నోట్లతో లంచాలివ్వాలని ఇప్పటికే వేధింపులు మొదలయ్యాయి. కాబట్టి ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు లంచాలు తీసుకోకుండా సమర్థవంతంగా ప్రజలకు సేవలందించేందుకు 'పౌరసేవల హక్కు' (సర్వీస్ గ్యారంటీ) చట్టాన్ని తీసుకురావాలి. ప్రతి పనికీ ఒక నిర్ణీత గడువు పెట్టటం, ఆ టైంలోగా పూర్తికాకపోతే దరఖాస్తు చేసిన ప్రజలకు రోజుకు కనీసం రూ. 250 పెనాల్టీ చెల్లించటం ఈ చట్టంలో భాగంగా వుంటుంది. ఇలా మంచినీటి కనెక్షన్, విద్యుత్తు అవసరాలు, వివిధ ధ్రువపత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకం వంటివి, భూముల వివరాలు వంటివి అందించే పౌరసేవల చట్టం కోసం లోక్‌సత్తా 1998 నుంచి పోరాడుతోంది. ఎట్టకేలకు 2011లో ఈ చట్టం పార్లమెంటు ముందుకు వచ్చినా ఇప్పటికీ చట్టం కాలేదు. కేంద్రం, తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వేగంగా ఈ చట్టాన్ని తీసుకొస్తే ప్రజలకు సేవలు కొంత సక్రమంగా అందుతూ వాళ్లు పన్నులు కట్టటానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తారు. (ఇదే స్ఫూర్తితో కిరణ్మయి అనే సాధారణ మహిళ హైదరాబాద్ రోడ్ల మరమ్మతు పేరుతో నాటకాలాడుతున్న వారిని నడిరోడ్డు మీదే ప్రశ్నించారు. జనం డబ్బులేమన్నా రాళ్లనుకున్నారా? అని నిలదీశారు.

లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా చెబుతున్న ఈ అంశాలతోనే పన్నులకు తగ్గ సేవలను డిమాండ్ చేస్తూ శిరమణి నరేష్ 'కొరడా డాట్‌కామ్'లో 'నోట్ల రద్దుపై మోదీకి హైదరాబాదీ సంచలన లేఖ' పేరుతో రాసిన న్యూస్ ఐటం (ఇదే సంచికలో చూడవచ్చు) వైరల్ అయింది).

**3) రాజకీయ పార్టీల నిధుల వ్యవస్థను ప్రక్షాళన చేయటం:** నల్లధనాన్ని, దాని చుట్టూ అవినీతిని అంతం చేయటానికి మరో ముఖ్యమైన అంశం రాజకీయ పార్టీల నిధుల వ్యవస్థను ప్రక్షాళన చేయటం. పార్టీలకు వస్తున్న నిధులలో నల్లధనమే ఎక్కువ ఉండటం వ్యవస్థలో అవినీతికి మూలవేరు అని గుర్తించబట్టే 2003లో లోక్‌సత్తా 'రాజకీయ పార్టీలకి నిజాయతీ విరాళాల' చట్టాన్ని తీసుకొచ్చింది. ఇందుకు అప్పట్లో ప్రధాన జాతీయ పార్టీలు కూడా సహకరించాయి. దీనివల్ల ఒక పార్టీకి విరాళమిస్తే అందుకు ట్యాక్స్ మినహాయింపు వస్తుంది. కానీ ఈ చట్టం చాలలేదు. "జయప్రకాష్ గారూ! ఈ చట్టాన్ని ఎంతో కష్టపడి తెచ్చారుగానీ చెక్కు ద్వారా విరాళాలివ్వాలంటే మాకు వచ్చే డొనేషన్లు పదోవంతుకు పడిపోయాయని" బీజేపీ అగ్రనాయకుడు అరుణ్‌జైట్లీ పలుమార్లు జేపీతోనే అన్నారు. రాజకీయ పార్టీలు సమాచార హక్కు చట్టం పరిధిలోకి రావు అని అడ్డగోలుగా వాదించే స్థాయికి పార్టీలు ఈవేళ చేరుకున్నాయి. దీనికితోడు ఎన్నికల ఖర్చు చుక్కలను తాకుతోంది. ఆంధ్రప్రదేశ్ నుంచి మొదలైన డబ్బు రాజకీయాలు కర్ణాటక, తమిళనాడు నుంచి దేశవ్యాప్తమయ్యాయి. ఐదేళ్లకోమారు ఎన్నికల్లో లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక ప్రభుత్వాల్లో రూ. 1–2లక్ష కోట్ల నల్లధనాన్ని ఖర్చు చేస్తున్నట్టు సాధికార అంచనా. వీటిలో ఎక్కువ భాగం ఓట్ల కొనుగోలుకే ఖర్చవుతున్నాయి. నల్లధనం మాత్రమే విరాళం ఇచ్చేవారు ఒకందుకు ఇస్తుంటే, పుచ్చుకునే పార్టీలు, నేతలు ఓట్ల కొనుగోలు రాజకీయం కోసం ఆ నల్లధనాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఎన్నికల్లో డబ్బు ఇవ్వకపోతే ఓటింగ్‌కు కూడా మేము రాము అని తీర్మానాలు కూడా చేసిన ప్రాంతాలున్నాయి. సమస్య ఇంత సంక్లిష్టం కాబట్టే.. ఇక్కడ చాలా ముందుచూపుతో, సంకల్పంతో సంస్కరణల్ని చేయాలి. నల్లధనాన్ని పెంచి పోషిస్తున్న రాజకీయ పార్టీల విరాళాలు, ఎన్నికల వ్యవస్థలో సమూల సంస్కరణల్ని తీసుకురావాలి.

అవినీతి, రాజకీయం ఎక్కువగా రాష్ట్రాల చుట్టూ తిరుగుతున్నాయి కనుక మొదట రాష్ట్రాల్లో ఎన్నికల మీద గట్టి దృష్టి పెట్టాలి. ఎమ్మెల్యేల ఎన్నికకు పార్టీలు నియోజకవర్గానికి రూ. 5-10 కోట్లు స్పాన్సర్ చేస్తున్నాయి. కొన్ని చోట్ల రూ. 20 కోట్లు కూడా ఇస్తున్నాయి. కాబట్టి ఇక ఎమ్మెల్యేలు ఆ పార్టీ అధ్యక్షుడు/ముఖ్యమంత్రి చెప్పినట్టే ఆడతారు తప్ప చట్టసభల్లో కూడా మాట్లాడలేరు, అవినీతికి పాల్పడకుండా ఉండలేరు. ఉన్న ఎమ్మెల్యే సంఖ్య బటాబటి అనుకుంటే ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను కోట్లు వెదజల్లి కొంటున్నారు లేదా కోట్లు సంపాదించే అవకాశం వారికి కల్పిస్తున్నారు. ఎమ్మెల్యేల పని ప్రధానంగా చట్టసభలో ప్రజల సమస్యల్ని చర్చించి చట్టాలు చేయడం. కానీ ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల చేత ప్రజలకు పనులు చేయించిపెట్టటమేగా ఉంటోంది. ఇందుకోసం ఎమ్మెల్యేల్లో ఎక్కువమంది అధికార పార్టీలోనే

**పెద్ద నోట్లు రద్దు చేసినా విదేశాల్లోని తమ బంధువుల ఖాతాల్లో నుంచి నల్లధనాన్ని తెలుపుగా మార్చుకునేవారు ఉంటారు. ఇది చాలా ఏళ్లుగా జరుగుతున్న నల్లదందా. కాబట్టి విదేశాల్లో తమ బంధువుల ఎకౌంట్లలో డబ్బు దాచుకుని లావాదేవీలు చేస్తున్నవారి పట్ల 'సఫేమ' (స్మగ్లర్స్ అండ్ ఫారిన్ ఎక్సేంజ్ మ్యానిప్యులేటర్స్) చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. రాజకీయ నేతలు, అధికారులు సహా కొందరు అవినీతిపరులపైనైనా ఇలా కఠినచర్యలు తీసుకుంటే అవినీతికి కళ్లెం పడుతుంది.**

ఉండా/చేరాలనుకుంటున్నారు. లంచాలు, వేధింపులతో ప్రజల్ని వేధించే ప్రభుత్వోద్యోగులు, ఓటును లంచంగా అడిగి ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించే ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇందుకోసం అధికార పార్టీలోనే ఉండాలని కోరుకుంటూ చట్టసభలను గాలికొదిలేసిన ఎమ్మెల్యేలు, పదవిని కాపాడుకోవటం కోసం ఎమ్మెల్యేలను భరించక తప్పదను కుంటున్న ముఖ్యమంత్రులు- ఇలా మన ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం భ్రష్టుపట్టింది. కొంతమంది నిజాయతీపరులున్నా కుళ్లిన వ్యవస్థలో వారూ మౌనంగా భాగస్వాములైపోయారు.

అవినీతి నిరోధక సంస్కరణల్లో భాగంగా ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వ్యవస్థను తీసుకురావాలి. అంటే ఇక ముఖ్యమంత్రికి ఎమ్మెల్యేల మీద ఆధారపడే పరిస్థితి ఉండదు. ఎన్నికైతే సమాజంలోని అత్యుత్తముల్ని కూడా తన కేబినెట్‌లో, పాలనావ్యవస్థలో తీసుకోగలుగుతారు. దీనివల్ల కొంత రాజకీయ ప్రక్షాళన జరుగుతుంది. దీంతోపాటు దేశవ్యాప్తంగా దామాషా ఎన్నికల పద్ధతిని తీసుకురావాలి. నా ఓటు వేస్తు వంటి భయాలు, అపోహలు దీనివల్ల తొలగిపోతాయి. అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను, నిధుల్ని బదిలీ కూడా చేస్తే.. పాలన, రాజకీయ వ్యవస్థ గురించి ప్రజల్లో అవగాహన పెరిగి నిజమైన ప్రజాస్వామిక సంస్కృతితో భాగస్వాముల్ని కాగలుగుతారు. సమర్థులు, నిజాయతీపరులు రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలు పెరుగుతాయి. ఈ మార్పులన్నిటినీ తీసుకొస్తేనే లోక్‌సభ, అసెంబ్లీలకు దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలన్న మోదీ ప్రభుత్వ ప్రయత్నం వల్ల ఉపయోగం ఉంటుంది. ఒకేసారి ఎన్నికల పద్ధతి దానంతటదే గేమ్ ఛేంజర్ కాదు. అలాగే ఎన్నికల వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలనటంపై చర్చించవచ్చుగానీ ఓట్ల కొనుగోలు రాజకీయంలో దాని వల్ల పెద్ద ప్రయోజనం ఉండదు.

ఇక ఇదేసమయంలో పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని, సమాజంలో వలంటీర్ల సంస్కృతిని పెంచితే.. పార్టీల విరాళాల విధానాన్ని గాడిలో పెట్టవచ్చు.

**4) అవినీతి నిరోధక వ్యవస్థల్ని, చట్టాల్ని బలోపేతం చేయాలి:** లక్షల కోట్ల రాజకీయ నేతల, ఉన్నతాధికారుల అవినీతికి - నల్లధనానికి చీకటి సంబంధాలున్నాయి కాబట్టి పై మూడు సంస్కరణలతోపాటు అవినీతి నిరోధక వ్యవస్థల్ని, చట్టాల్ని బలోపేతం చేయటం కూడా అవసరం. ఇందులో భాగంగా దర్యాప్తు సంస్థలైన ఏసీబీ, సీబీఐలకు జవాబు దారీతనంతో కూడిన స్వతంత్ర ప్రతిపత్తిని ఇచ్చి కేంద్రంలో లోక్‌పాల్‌లాగా రాష్ట్రాల్లో లోకాయుక్తను బలోపేతం చేయాలి. తగినంతమంది సిబ్బందిని, అధికారాలను ఇవ్వాలి. స్వతంత్ర ప్రాసిక్యూషన్‌ను ఏర్పాటు చేయాలి.

మనదేశంలో రూ. 30లక్షల కోట్ల నల్లధనం ఉందనుకుంటే, అందులో వస్తు, ఇతర సంపదల రూపంలోనే రూ. 20లక్షల కోట్ల దాకా ఉంటుంది. విదేశాల్లోనూ వీటిని ఏర్పరచుకుని ఉంటారు. మిగిలిన 10లక్షల కోట్లే నగదు. ఇందులో సామాన్య, మధ్యతరగతివారికి కొంత మినహాయింపునిచ్చి మిగలిన దాన్ని కక్కించి జప్తు చేయాలంటే.. బలమైన అవినీతి నిరోధక వ్యవస్థలు కావాలి.

పెద్ద నోట్లు రద్దు చేసినా విదేశాల్లోని తమ బంధువుల ఖాతాల్లో నుంచి నల్లధనాన్ని తెలుపుగా మార్చుకునేవారు ఉంటారు. ఇది చాలా ఏళ్లుగా జరుగుతున్న నల్లదందా. కాబట్టి

విదేశాల్లో తమ బంధువుల ఎకౌంట్లలో డబ్బు దాచుకుని లావాదేవీలు చేస్తున్నవారి పట్ల 'సఫేమ' (స్మగ్లర్స్ అండ్ ఫారిన్ ఎక్స్చేంజ్ మ్యానిప్యులేటర్స్) చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. రాజకీయ నేతలు, అధికారులు సహా కొందరు అవినీతిపరులపైనైనా ఇలా కఠినచర్యలు తీసుకుంటే అవినీతికి కళ్లెం పడుతుంది.

ఇవి చేయకుండా కేవలం పెద్దనోట్లు రద్దు చేయడానికే పరిమితమైతే తాత్కాలికంగా నకిలీనోట్లు పోతాయి, మోదీది రాజకీయ డ్రామానే అవుతుంది. నల్లధనంపై ఈ యుద్ధంలో అవసరమైతే ఈ క్రమంలో ప్రాణత్యాగానికైనా సిద్ధమని ఆయన భావోద్వేగ ప్రసంగం చేస్తున్నారు. అంతక్కర్లేదు. అంతా తన పర్సనాలిటీ చుట్టూనే ఆయన తిప్పుకోనక్కర్లేదు. వ్యక్తిగత ప్రతిష్ఠను ఫణంగా పెట్టటం అనేది విధానాలకు బలం చేకూర్చే చిట్టచివరి అస్త్రం మాత్రమే కావాలి. మోదీ అవినీతికి పాల్పడలేదు అని నమ్ముతున్న ప్రజలు ఆయన పెద్దనోట్ల రద్దు ప్రకటన చేసిన వెంటనే సమర్థించారు. అమలులో వైఫల్యం వల్ల కొన్ని సమస్యలు తలెత్తినా పంటి బిగువన భరించారు. కానీ అదే మోదీ తెలుగు రాష్ట్రాల్లో ఓటుకు కోట్లు కేసు పట్ల ఎలా వ్యవహరించారు? ఆ కేసులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాన నిందితునిగా ఉండి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య వివాదంగా, సొంత ఏసీబీ, సొంత పోలీసు విచారణగా మారడంతో సీబీఐతో విచారణ జరిపించాలని గవర్నర్ ద్వారా లోక్‌సత్తా లేఖ రాసినా ప్రధాని ఎందుకు స్పందించలేకపోయారు? అవినీతి అంతం గురించి ప్రజలకు సుద్దులు చెప్పే గవర్నర్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడటం లేదు? ఈ కేసు ఎంత వికృత స్థాయికి వెళ్లిందంటే.. ఎన్నికల్లో ఓటు వేసేందుకు డబ్బు తీసుకుంటే అది అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్) పరిధిలోకి రాదని చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాది కోర్టులో వాదించారు. ఓటు వేయటమన్నది ప్రజావిధుల్లో భాగం కాదని, అది కేవలం రాజ్యాంగపరమైన బాధ్యత మాత్రమేనని, కాబట్టి ఓటుకు కోట్లు ఇచ్చినా అవినీతి కేసుగా విచారణ చేయకూడదని వాదన చేశారు. కోట్ల రూపాయల నల్లడబ్బు, అవినీతి సొమ్ముతో ఓట్లు కొని అధికారాన్ని పొందటం అవినీతి కాకపోతే ఇక ఎన్నికలు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎందుకు? ఇంగితజ్ఞానానికి కూడా అర్థమవుతున్న మరో అవినీతి భాగోతం వైఎస్ జగన్ కేసులో ప్రధాని ఏం చేయగలిగారు? కంపెనీల్ని దివాళా తీయించి తాము మాత్రం వేలకోట్ల ఆస్తుల్ని సంపాదించుకున్న బడా బాబులు కళ్ల ముందే కనబడుతున్నా వాళ్లు ఎగ్గొట్టిన లక్షల కోట్ల బ్యాంకు రుణాల్ని ఎందుకు ముక్కు పిండి వసూలు చేయలేకపోతున్నారు? .. ఇవన్నీ శాంపిళ్లే.. ఎలాగూ వ్యవస్థలు శిక్షించలేవు, మనకెందుకు, అయినకాడికి మనమూ దండుకుందాం అని రాజకీయాల పట్ల జుగుప్స, అవగాహనారాహిత్యంతో అనుకునే పేదలు, అమాయకులు కోకొల్లలుగా ఉన్న దేశం మనది. అలాంటి దేశంలో తీవ్ర అవినీతి కేసులపై ప్రధాని వ్యవహరించాల్సిన తీరు ఇదేనా?

అలాగే జనన ధృవపత్రం కోసం ఓ రూ.100 లంచం ఇచ్చిన ప్రజలపై కేసులు పెడతారట, ప్రభుత్వోద్యోగి మీద లంచం ఆరోపణ వస్తే పోలీసు కేసు పెట్టాలన్నా ముందుగా అనుమతి కావాలంట. ఓపక్క 1988నాటి బినామీ ఆస్తుల నిషేధ చట్టానికి నిబంధనలు రూపొందించి అమల్లోకి తెస్తూ మరోపక్క ఈరకమైన ప్రజావ్యతిరేక సవరణను అవినీతి నిరోధక చట్టానికి మోదీ ప్రభుత్వమే చేస్తోంది (ఈ సవరణను వెంటనే తొలగించాలని లోక్‌సత్తా ప్రధానికి, పార్లమెంటు సభ్యులకు కూడా లేఖలు ఇప్పటికే లేఖలు రాసింది).

కాబట్టి ముందు నల్లధనాన్ని, దాని చుట్టూ అల్లుకున్న అవినీతిని అంతం చేసేందుకు పన్నులు తగ్గించటం, కట్టిన పన్నులకు కూడా తగిన సేవలు అందించేలా పౌరసేవల చట్టం వంటి చర్యలు తీసుకోవటం, అవినీతికి మూలమైన రాజకీయ పార్టీల విరాళాలు, ఎన్నికల విధానాల్ని సమగ్రంగా ప్రక్షాళన చేయటం, అవినీతి కేసుల విచారణ నిష్పాక్షికంగా, వేగంగా జరిగేందుకు దర్యాప్తు సంస్థలకు స్వతంత్ర ప్రతిపత్తి, బలమైన లోక్‌పాల్–లోకాయుక్తల వ్యవస్థ ఏర్పాటు చేసేలా ప్రధానమంత్రిని ప్రజలు గట్టిగా డిమాండ్ చేయాలి. ఏ దశలోనూ పట్టువిడవకుండా ప్రజలు ఈ వ్యవస్థీకృత మార్పుల కోసం పోరాడితేనే భారత్‌ను అవినీతి రహితం చేసుకోగలరు.

ప్రధానమంత్రి ముందుగానే ఈ చర్యలు తీసుకుని వుంటే చాలా తేలిగ్గా పెద్దనోట్ల రద్దు కార్యక్రమాన్ని అమలుచేయగలిగి వుండేవారు. ఇదో రాజకీయ డ్రామాలాగా కాకుండా ఓ పెద్ద సంస్కరణగా ప్రజలు భావించివుండేవారు. ప్రాణత్యాగం వంటి పెద్దపెద్ద పదాలను వాడాల్సిన అవసరం కూడా ప్రధానికి ఉండేది కాదు. మరోవైపు, సమాజంలో సామరస్యత, పరస్పర విశ్వాసం కొరవడుతుండటం కూడా మోదీ ప్రయత్నాన్ని జటిలం చేసింది.

పెద్ద నోట్ల, ముఖ్యంగా రూ.500 రద్దు వల్ల రోజువారీ చెల్లింపులు కూడా చేయలేకపోతున్నామని చాలామంది సామాన్య,

మధ్యతరగతి వాళ్లు అనటం సమాజంలో ప్రజల మధ్య పరస్పర విశ్వాసం తగ్గుతుండటానికి అద్దం పడుతోంది. పూర్వం ఒక పని చేయించుకున్నా, చేసిపెట్టినా సరకులను ఇచ్చిపుచ్చుకోవటం, డబ్బులు ఉన్నప్పుడు ఇస్తామన్నా సర్దుకోవటం ఒక సంస్కృతి సంప్రదాయంలా ఉండేవి. కానీ చెదురుమదురుగా మినహాయిస్తే.. ఇప్పుడు చాలాచోట్ల రూ.500, 1000 నోట్లు మార్చుకోవడానికి సమయం ఉన్నా ఎవరూ వాటిని తీసుకోకపోవటం, చిన్న నోట్ల కోసం అంత గందరగోళం ఏర్పడటం విస్మయం కలిగిస్తుంది. మరోవైపు, పెళ్లిళ్లను నిరాడంబరంగా జరుపుకుంటే నష్టమేమిటి? అన్న స్పృహ కూడా పెరగలేదు. చాలా ఐరోపా దేశాల్లో, ఆ మాటకొస్తే అమెరికాలో కూడా ప్రపంచ యుద్ధాలవంటి పరిస్థితులు వచ్చి సమాజంలో చాలా చలనం వచ్చింది. మనదేశంలో అటువంటి పరిణామాలు ఆధునిక కాలంలో చాలా తక్కువ. 1975లో వచ్చిన ఎమర్జెన్సీ ప్రభావం కూడా ఆ స్థాయిలో లేదనే చెప్పాలి. ఇందిరాగాంధీని గద్దె దింపాలన్నంత మేరకే ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంగా వచ్చిన లోక్‌నాయక్ జేపీ 'అవినీతి వ్యతిరేక ఉద్యమ' లక్ష్యం పరిమితమైంది. దక్షిణాదిన ఎమర్జెన్సీ ప్రభావం ఇంకా తక్కువగా ఉంది. కానీ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నల్లధనంపై, ఆ డబ్బుతో చేసే అవినీతిపై మోదీ ప్రభుత్వం దేశం మొత్తాన్నీ పెద్దనోట్ల రద్దుతో కొంతమేర కదిలించగలిగింది. తీవ్ర ఆర్థిక అసమానతల మధ్య ఇప్పటికే తెలిసోతెలియకో, గతిలేకో అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల నుంచి పన్నులు కడుతూ త్యాగాలు చేస్తున్న ప్రజలు ఈసారి కూడా త్యాగాలకు సిద్ధపడి ప్రభుత్వానికి సహకరించారు. కానీ నిజాయతీతో బతకగలమనే నమ్మకం ప్రజలలో కొరవడటం వల్ల మోదీ సర్జికల్ స్ట్రయిక్ ఊహించినదానికన్నా ఎక్కువ సమస్యల్ని సృష్టించింది.

విచిత్రమేమిటంటే, మోదీ చేసిన పెద్దనోట్ల రద్దు నిర్ణయాన్ని విమర్శిస్తున్నవారు కూడా నల్లధనం, దానితో ముడిపడిన రాజకీయ అవినీతి పోవడానికి ఎటువంటి పరిష్కారాలూ చెప్పటం లేదు. యథాస్థితిని కొనసాగించి రాజకీయ కాలక్షేపం చేద్దామని తప్ప ఏం మార్పులు కావాలో చెప్పి వాటి కోసం డిమాండ్ చేయడం లేదు.

అధికారాన్ని కేవలం కొందరు వ్యక్తుల చేతుల్లో కేంద్రీకరిస్తే తలెత్తే సమస్యలు, సంక్షోభాల జాబితాలో ఏదోకస్థాయిలో పెద్ద నోట్ల రద్దు కూడా చేరుతోంది. మోదీ కొద్దిమంది ఉన్నతాధికారుల బృందాన్ని నిర్మించుకుని గుజరాత్ ముఖ్యమంత్రిలా, ఏకపక్షంగా వ్యవహరిస్తుంటే పరిణామాలు ఆయనకు తెలియకుండానే ప్రతికూలంగా మారే ప్రమాదం ఉంది. మోదీ విఫలమవటం దేశానికి ఈదశలో ఖరీదైన మూల్యమవుతుంది. పెద్ద నోట్ల రద్దుకు మిగిలిన సంస్కరణల్నీ జత చేయకుంటే అన్నా హజారే నేతృత్వంలో అరవింద్ కేజ్రీవాల్ వంటి వారు కలిసి చేసిన ఇండియా ఎగనెస్ట్ కరప్షన్ పోరులాగా నల్లధనం, అవినీతిపై మోదీ పోరు కూడా కొండను తవ్వి ఎలకను పట్టిన చందంగా తయారవుతుంది.


ఈ నేపథ్యంలో.. పెద్దనోట్ల రద్దు నిర్ణయం పెద్ద వృథా ప్రయత్నంగా మిగిలిపోకుండా సమస్యలన్నిటినీ అధిగమించి, ఫలితం సాధించేలా ప్రజలు ధైర్యంగా తమ వంతు కార్యాచరణను ప్రారంభించాలి. ఇంతకుముందు అనుకున్న నాలుగు సంస్కరణల్నీ ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం చేత అమలు చేయించాలి.

ఈ నాలుగింటికితోడు.. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం (వీటిని కూడా క్రమంగా పౌరసేవల చట్టం పరిధిలోకి తేవాలి), ఉపాధి అవకాశాల్ని గ్యారంటీ చేయటం, పన్నుల డబ్బు సక్రమంగా ఖర్చవుతుందో లేదో మనం తనిఖీ చేసుకునేందుకు వీలుగా అధికారాన్ని, అభివృద్ధిని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని ఇవ్వటం, ఏటా తలసరి రూ.2000 నేరుగా ప్రజలపేరున వార్డు, పంచాయతీ స్థాయి వరకు కేటాయించటం కూడా జోడించి ఎజెండా ఫిక్స్ చేసుకుంటే చాలు – మోదీ చేసిన తప్పులు చేయకుండానే పర్‌ఫెక్ట్ తొలిదశ సర్జికల్ దాడిని ప్రజలు రాజకీయ, పాలనా వ్యవస్థల మీద చేయవచ్చు. మోదీ చర్య వల్ల వచ్చిన సైడ్ ఎఫెక్ట్‌లు కూడా దీని మూలంగా రావు. ప్రజల చేతిలో ఈ దాడికి ఉన్న ఆయుధాల్ని ఇంకోసారి గుర్తుచేయాలంటే.. ఓటు, భావప్రకటనా స్వేచ్ఛ, స్వతంత్ర సంఘాలుగా ఏర్పడటం. అంటే అహింసాయుత నక్సలిజం, రక్తపాత రహిత విప్లవంతో మంచి రాజకీయాన్ని, సుపరిపాలనను ప్రతిష్ఠించుకోవటం. నల్లధనంపై మోదీ ప్రభుత్వం చేసిన మెరుపుదాడి, అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం ఇప్పటికే ఆలస్యమైన మన కార్యాచరణకు తక్షణ చోదకశక్తులు.

రాజకీయ, పాలనా సంస్కరణల కోసం దశలవారీ అహింసాయుత సర్జికల్ దాడులకి కావలసిన తిరుగులేని ఎజెండాతో లోక్‌సత్తా రెడీ.. మరి 130 కోట్ల భారతీయులరా! మీ వంతు కార్యాచరణకు మీరూ రెడీనా? ❍

# మోదీ గారూ, నేను ట్యాక్స్ ఎందుకు ఎగ్గొట్టానంటే..?

**(ఎన్నో ఏళ్లుగా లోక్‌సత్తా చెబుతున్న మాట - నేడు సోషల్ మీడియాలో వైరల్ బాట)**




**ప్రియమైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీగారు, నమస్కారం.**

నా పేరు ప్రసాద్. హైదరాబాద్‌లోని బాలానగర్‌లో చిన్న ఇండస్ట్రీ నడుపుతాను. నెలకి 2లక్షల దాకా ఆదాయం వస్తుంది. అంటే, ఏడాదికి 24 లక్షలు. నిజాయితీగా అయితే ఏడాదికి కనీసం 3లక్షలు (మినహాయింపులు అన్నీ పోను) ఆదాయపు పన్ను కట్టాలి. అయితే నేను జస్ట్ 30వేలు మాత్రమే పన్ను కడతాను.. ఎందుకంటే?

నేను మామూలు మధ్యతరగతి ఫ్యామిలీలో పుట్టా. కష్టపడి చదువుకుని కొన్నాళ్లు ఉద్యోగం చేసి, పైసా పైసా కూడబెట్టి ఇప్పుడు సొంత ఇండస్ట్రీ పెట్టుకునే దశకు చేరుకున్నాను. నా సంపాదన రెండు లక్షల్లో, ఒక లక్ష నా కుటుంబ అవసరాలకి సరిపోతుంది. మిగతా లక్ష భూములు, బంగారం లాంటి వాటిల్లో ఇన్వెస్ట్ చేస్తాను. నేను ఖర్చు పెట్టే లక్ష రూపాయల్లో దాదాపు 30వేలు పరోక్ష పన్నుల రూపంలో ప్రభుత్వం రాబట్టుకుంటోంది. కిరాణా సరకుల దగ్గర్నుంచి టీవీ, మొబైల్ దాకా ఏది కొన్నా 20 నుంచి 30శాతం పన్ను. ఇక ఫ్రెండ్స్‌తో పార్టీ చేసుకుంటే 3,000 ఖర్చు అయితే, దాదాపు 60శాతం ప్రభుత్వానికి పన్ను. కారుకి పెట్రోల్ కొట్టిస్తే లీటరుకి రూ.30 పన్ను. కారు కొంటే అన్ని ట్యాక్సులూ కలిపి ప్రభుత్వానికి లక్షన్నర చెల్లించా. ఇంటి స్థలం కొంటే లక్ష రూపాయలు రిజిస్ట్రేషన్ కోసం కట్టా. ప్రభుత్వం కనీసం మట్టిరోడ్డు కూడా వేయని మా కాలనీలో స్థలం కొన్నందుకు ప్రభుత్వం డెవలప్‌మెంట్ ఛార్జీల పేరుతో రూ.50వేలు వసూలు చేసింది. ప్రభుత్వ

ఆసుపత్రులు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో చూశాక, తప్పదని హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటే, సిగ్గు కూడా లేకుండా ప్రభుత్వం దాని మీద సర్వీస్ ట్యాక్స్ వేసింది. దారిదోపిడీ దొంగలు దోచుకున్నట్టు.. ప్రతి దాని మీద ఆఖరికి శ్మశానంలో శవదహనం మీద కూడా పన్నులేస్తున్న ప్రభుత్వం మాకు తిరిగి ఏమిస్తోంది?

గవర్నమెంట్ స్కూళ్లలో మా పిల్లల్ని చేర్పిస్తే చదువు వస్తుందనే నమ్మకం ఉందా? గవర్నమెంట్ ఆసుపత్రికి వెళ్తే ఆరోగ్యంతో తిరిగి వస్తామనే నమ్మకం ఉందా? దేశ రక్షణ, రోడ్లు వేయటం తప్ప, చేస్తున్న అభివృద్ధి పనులేమిటో మాకు అర్థం కావటం లేదు. కారు కొంటే రోడ్ ట్యాక్స్, రోడ్డెక్కితే టోల్ ట్యాక్స్.. తోలు తీస్తున్నారు కదా సార్. ఇక మా పన్నుల డబ్బు ఏమైపోతోంది? మా ఇండస్ట్రీలో పనిచేసే వారికి జీతం పెంచాలి అంటే.. వారు ఎంత పనిచేస్తారు? ఎలా పనిచేస్తారు? అని ప్రతి ఏడూ చూసి ఇంక్రిమెంట్ ఇస్తాం. కానీ ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి? ఉద్యోగి పనిచేసినా చేయకపోయినా, అధ్వాన్నంగా చేసినా, అందరికీ ఒకే జీతం, ఒకే ఇంక్రిమెంట్.. మా సొమ్మంటే అంత లోకువా? పైగా మా పన్నుల డబ్బుతో జీతాలు తీసుకుంటూ, మా పనులు చేయాలంటే, ఫోజులు కొడతారు. 10 గంటలకి ఆఫీసు అంటే 11 గంటలకి వస్తారు. లంచం లేకుండా ఒక్క పని కూడా చేయరు. మరి ఎందుకు సార్, మేము ప్రభుత్వానికి పన్నులు కట్టాలి. ఇండస్ట్రీ నడవాలి అంటే, కరెంటు వాళ్లతో మొదలుపెట్టి అందరికీ లంచాలు ఇవ్వాలి. అందరికీ కలిపి నెలకి సుమారు 10వేలు లంచాలు ఇవ్వాల్సి వస్తోంది. ఆ లంచాలన్నీ వైట్‌లో చూపించటం ఎలా సార్? అందుకే సార్, మాకు ప్రభుత్వాలకి పన్ను కట్టాలంటే కడుపు మండిపోద్ది. అలాగని నేను సామాజిక బాధ్యత లేనివాణ్ణి కాదు సర్. మీరు సైనిక నిధికి విరాళం ఇవ్వమంటే 10వేలు ఇచ్చా. మా దగ్గరలో ఉన్న అనాథాశ్రమానికి ఏడాదికి 20వేలు ఇస్తా. మా ఊర్లో స్కూలు బాగుచేస్తామంటే మా నాన్న పేరు మీద లక్ష డొనేషన్ ఇచ్చా. కానీ ప్రభుత్వానికి పన్ను కట్టాలంటే మాత్రం నాకు మనసొప్పదు సార్.

ఓకే.. ఇదంతా గతం. ఇప్పుడు అంతా వైట్ మనీలోనే వ్యవహారాలు చేద్దాం. మీరు డిసైడ్ చేశారు కాబట్టి, నా దగ్గర వున్న 10లక్షల బ్లాక్ మనీకి 30శాతం అంటే 3 లక్షలు కట్టి, మొత్తం వైట్‌లోకి మార్చుకుంటా. కానీ, నేను రేపటి నుంచి నెలకి 10వేలు లంచాలు ఇవ్వకుండా పనులు అవుతాయనే గ్యారంటీ ఇస్తారా? లేదా లంచాన్ని చెక్ రూపంలో తీసుకొమ్మని ఉద్యోగులకి పర్మిషన్ ఇస్తారా? ఇక నాయకుల సంగతి చెప్పలేదు కదా.. మా గల్లీ లీడర్ దగ్గర్నుంచి, ఎమ్మెల్యే దాకా అందరి ఎలక్షన్లకి, అన్ని పార్టీలవారికీ విరాళాలు ఇవ్వాలి. లేకపోతే ఇబ్బంది పెడతారు. వీళ్లని కూడా విరాళాలు చెక్కుల రూపంలో తీసుకొమ్మని చట్టం చేస్తారా? పార్టీల డబ్బుల లెక్కల్ని రహస్యం లేకుండా ఓపెన్‌గా చెబుతారా? ఇప్పటికే బోలెడు పన్నులు కడుతున్న మేము పన్నులు కట్టం సర్. వీలైనంత ఎగ్గొడతాం. పదేళ్లకి మళ్లీ దేశంలో బ్లాక్‌మనీ పెరిగిపోతుంది. అప్పుడు మళ్లీ నోట్ల మార్పిడి తెస్తారా? ఇందుకు కాదు సర్, మిమ్మల్ని ఎన్నుకుంది. మీ నిర్ణయం వల్ల రెండు రోజులుగా చేతిలో డబ్బు లేక ఇబ్బందిపడుతున్న మా వర్కర్స్ కూడా, మీ మీద నమ్మకంతో ఈ ఇబ్బందిని సంతోషంగా భరిస్తున్నారు సార్. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోండి. ముందు మేము కడుతున్న పన్నులకి న్యాయం చేయండి. అప్పుడు మేము కూడా న్యాయంగా పన్నులు కడతాం. రెండు చేతులూ కలిస్తేనే సర్ చప్పట్లు. మా చెయ్యి రెడీ. మీ చేత కోసం ఎదురుచూస్తుంటాం.

ఇట్లు

మీ

అభిమాని, ఓటరు

(కర్టెసీ: కొరడా డాట్‌కామ్) ❍

# సాహసోపేత నిర్ణయం సామాన్యుల అభివృద్ధి/సేవ కోసం ఉపయోగపడాలి

- అనమోలు రాఘవయ్య,
హైకోర్టు న్యాయవాది, లోక్‌సత్తా పార్టీ నేత

రూ. 500, 1000 నోట్లను రద్దు చేస్తూ మన ప్రధాని తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని ఏకకంఠంతో ఆహ్వానిద్దాము. కొన్ని విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నప్పుడు చిన్న చిన్న ఇబ్బందులు కలుగుతాయి. వాటికి మనందరము సిద్ధంగా ఉండాలి.

ప్రజాస్వామ్యంలో 'రాజకీయం' అంటే ప్రజల కోసం అనే విషయాన్ని మనందరము మరచి పోతున్నాము. అది కాగితాలకే పరిమితమై నాయకులకు వేదికల మీద ఉపన్యాసాలకు మాత్రమే ఉపయోగపడే ఆయుధంగా మారినది. ప్రస్తుతము మనందరికీ రాజకీయం అంటే.. ఒక పార్టీ గెలవటం, మరొక పార్టీ ఓడటం. గెలిచిన పార్టీలు రాచరికాన్ని తలదన్నే విధముగా పరిపాలన సాగిస్తుండటం, ఆ క్రమంలో మనం రాజ్యాంగంలో పొందుపర్చుకున్న వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ అభివృద్ధి ముసుగులో వ్యవస్థీకృత నేరాలకు దన్నుగా నిలుస్తూ, విద్య, వైద్యంలాంటి ప్రజా అవసరాలకు సంబంధించిన రంగాలను నిర్లక్ష్యం చేస్తున్నాయి. ప్రజలు తమ కనీస అవసరాలకు దందాలు చేసే చోటా నాయకులు, ఎమ్మెల్యేల చుట్టూ తిరిగే సంస్కృతిని పెంచి పోషిస్తున్నాయి. దీన్నే రాజకీయము అని చెలామణి చేస్తున్నాయి. కుల, మత, ప్రాంతాల పేరుతో ప్రజల మధ్య ద్వేష, రాగాలను పెంచి పోషిస్తూ వారసత్వ రాజకీయాలే లక్ష్యంగా సాగుతున్న ఈ రాజకీయాల తీరు మార్పునకు 500, 1000 రూపాయల నోట్ల రద్దుకై కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దోహదపడుతుందని ఆశిద్దాం.

అదేవిధంగా నల్లధనం ఇప్పటి వరకు రాజకీయాలను, సహజ వనరులు/ఖనిజ సంపద, విద్య, వైద్యం, బ్యాంకింగ్ మొదలైన ప్రధాన రంగాలను పట్టి పీడించినది. గతం పునరావృతం కాకుండా, ప్రస్తుత నిర్ణయం రానున్న ఎన్నికలకై తీసుకున్న రాజకీయ గిమ్మిక్కుగా తయారవకుండా ఉండాలంటే, ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన, పన్నుల తగ్గింపు, ప్రజల పన్నుల డబ్బును నాయకుల విలాసాలు, ఉద్యోగుల జీతాల భారీ పెంపునకు కాకుండా ప్రజల అభివృద్ధి/సేవ కోసం సద్వినియోగం చేసే దిశగా సంస్కరణలు ఉండాలి. అలాంటి సంస్కరణలకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుంది. సాహసోపేత నిర్ణయం తాత్కాలిక రాజకీయ అవసరాల కోసమా? ప్రజల అభివృద్ధి/సేవ కోసమా? మోదీ ప్రభుత్వం తేల్చుకోవాలి.

## కొరడా ఝుళిపించటం అవసరమేగానీ, సన్నద్ధత ఏదీ?

నల్లధనంపై మోదీ ప్రభుత్వం కొరడా ఝుళిపించటాన్ని స్వాగతిస్తున్నామని, అయితే సరైన సన్నద్ధత లేకపోవటం ఆచరణలో ప్రజలకు తీవ్ర ఇబ్బందుల్ని సృష్టిస్తోందని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చిన్న కరెన్సీ నోట్లను అందుబాటులో ఉంచుతూ ఆన్‌లైన్ బ్యాంకింగ్ వ్యవస్థను దశలవారీగా ఎలా తీసుకురావాలో రోడ్‌మ్యాప్ కరువైందన్నారు. రూ. 2వేల నోటు అవసరం లేదన్నారు. మళ్లీ నల్లధనం పోగుపడకుండా పార్టీల ఎన్నికల విరాళాలు సహా ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన, పన్నులకు తగ్గ సేవలకు పౌరసేవల చట్టం వంటి చర్యలు తక్షణావసరమని, ఇవి చేయకుండా ఉంటే సమర్థించిన ప్రజలే వ్యతిరేకించే ప్రమాదముందన్నారు. ❍

# పెద్ద నోట్ల రద్దుతో పాటు చేయాల్సిన సంస్కరణలపై ప్రజల్లో చైతన్యం కావాలి: లోక్‌సత్తా



పెద్ద నోట్ల రద్దు తర్వాత ప్రజలు ఎదుర్కొనే సమస్యలను అంచనా వేయటం, తగిన ఏర్పాట్లు చేయటంలో మోదీ ప్రభుత్వం తగురీతిలో స్పందించలేకపోయిందని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు అన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భారీ నోట్ల రద్దు ఆహ్వానించదగ్గ పరిణామమేనన్నారు. అయితే ఇలాంటి కీలక నిర్ణయం తీసుకునే ముందు సర్వసన్నద్ధంగా వ్యవహరించాల్సుందన్నారు. ఇది కేవలం ఒక గిమ్మిక్కుగా మిగిలిపోకుండా ఉండాలంటే నల్లధనం, అవినీతి అంతానికి చేపట్టాల్సిన ఇతర సంస్కరణలపై ప్రజలలో అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నామని, అన్ని చోట్లా పార్టీ యంత్రాంగం ఇందుకు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దుర్గారావు, సరోజాదేవి, మెట్ల జగన్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను అవమానించేలా వ్యవహరించొద్దు

నోట్ల ఉపసంహరణను సమర్థవంతంగా అమలుచేయటంలో ప్రభుత్వం విఫలమైందని లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము ధ్వజమెత్తారు. కేంద్రం నిర్ణయంతో సామాన్యులు చాలా ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారన్నారు. తగినన్ని రూ.500, 100, 50 నోట్లు అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలని, ఇతరత్రా ప్రత్యామ్నాయ చెల్లింపుల విధానాల్ని కూడా అమలు చేయాలని అన్నారు. డబ్బులు డ్రా చేసుకున్న వారికి ఇంకు గుర్తు వేయటం వంటి చర్యలతో ప్రజల్ని అవమానించవద్దన్నారు. నియంతలా కాకుండా.. ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తూ నిర్మాణాత్మకంగా సంస్కరణల్ని చేపడితేనే నల్లధనాన్ని, అవినీతిని అంతం చేయగలమన్నారు.

# పేదల జీవితాల్ని నాశనం చేస్తున్న మద్యం పాలన

డబ్బున్న వాళ్లు మద్యం తాగితే తమకు అభ్యంతరం లేదని, అయితే ప్రభుత్వం విచ్చలవిడి మద్యం అమ్మకాల్ని ప్రోత్సహిస్తుండటం వల్ల పేదలు నాశనమవుతున్నారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. సామాన్య జనం సంపాదన మద్యానికి, ఆసుపత్రులకే సరిపోతోందన్నారు. దీనికితోడు తాగి వాహనాలు నడపటం వల్ల వందలమంది అకాల మరణానికి బలవుతున్నారన్నారు. జాతీయ రహదారుల వెంట మద్యం దుకాణాలను తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో రాష్ట్ర, కేంద్ర హైవేలపై 801 మద్యం దుకాణాలు, 95 బార్లు ఉన్నాయన్నారు. పెద్ద నోట్ల రద్దుపై కేంద్ర ప్రభుత్వానికి పాలనా సుద్దులు చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ముందు రాష్ట్రంలో తన మద్యం పాలనను సంస్కరించుకోవాలని బాబ్జీ అన్నారు. ❍

# దాడుల్లో గుర్తించిన నల్లధనం నాలుగేళ్లలో రూ.40వేల కోట్లు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన స్వచ్ఛంద ఆదాయ వెల్లడి పథకం కింద 64,275 మంది రూ. 65,250కోట్ల నల్లధనాన్ని వెల్లడించారని కేంద్ర ఆర్థిక శాఖ పార్లమెంట్‌కు తెలిపింది. ఈ బ్లాక్ మనీ ద్వారా ప్రభుత్వానికి పన్ను రూపంలో రూ. 29,362.2కోట్లు రానుంది. ఈ పథకం రాకముందు గత నాలుగేళ్లలో (ఈ ఏడాది అక్టోబర్ వరకు) ఐటీ బృందాలు దేశవ్యాప్తంగా జరిపిన దాడుల్లో సుమారు రూ. 40వేల కోట్ల నల్లధనం వెలుగులోకి వచ్చింది. బాధ్యులైన వారి నుంచి రూ. 2836కోట్ల ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో 5శాతం ప్రజావేగుల సమాచారం ఆధారంగా చేసినవే వున్నాయి. నల్లకుబేరుల సమాచారం ఇచ్చిన వీరికి ప్రభుత్వం నజరానా కింద గత మూడేళ్లలో రూ. 2.95 కోట్లు అందచేసింది. పరోక్ష పన్నుల ఎగవేతను గుర్తించడంలో కూడా ప్రజావేగులు కీలక పాత్ర పోషించారు. వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా గత నాలుగేళ్లలో కేంద్ర కస్టమ్స్ అండ్ ఎక్సయిజ్ శాఖ అధికారులు 1,364 చోట్ల దాడులు నిర్వహించి రూ. 36వేల కోట్లను వసూలు చేశారు. దీనికి సంబంధించి వేగులకు ప్రభుత్వం రూ. 181.6 కోట్ల నజరానా అందచేసింది.

**భారీగా బకాయిలు**


ప్రత్యక్ష పన్నుల్లో వసూలయ్యేదానికంటే బకాయిలే అధికంగా ఉన్నాయి. నాలుగేళ్లలో (ఈ ఏడాది అక్టోబర్ వరకు) ప్రత్యక్ష పన్నుల కింద ప్రభుత్వ ఖజానాకు రూ. 24.53లక్షల కోట్లు చేరింది. ఇదే కాలంలో బకాయిలు రూ. 33.35 లక్షల కోట్లకు చేరాయి. వివిధ కారణాల వల్ల ఇందులో అధిక మొత్తం రాబట్టటం కష్టమని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించారు. పరోక్ష పన్నుల్లో కూడా రూ. 1.97 లక్షల కోట్ల బకాయిలున్నాయి. ఇందులో రూ. 1.61 లక్షల కోట్ల మొత్తానికి సంబంధించి వివిధ న్యాయస్థానాల్లో కేసులు నడుస్తున్నాయి. ❍




# చిన్ననోట్ల చెలామణిని పెంచండి

పెద్ద నోట్ల రద్దు నిర్ణయాన్ని అనాలోచితంగా అమలు చేస్తుండటం వల్ల చిల్లర కొరత తలెత్తి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చిన్న వ్యాపారాలు దెబ్బతిన్నాయని, తక్షణం ప్రభుత్వం ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదాసు భానుప్రసాద్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో జరిగిన నిరసన ప్రదర్శనలో ఆయన పాల్గన్నారు. ట్యాక్స్‌ల్ని తగ్గించటానికి, నల్లడబ్బు లేకుండా ఎన్నికలు జరిగేలా చూడటానికి, అవినీతిపరులపై కఠిన చర్యలకు కూడా సంస్కరణల్ని తీసుకురావాలన్నారు. ❍

# లంచాలు రూ.కోటి కోట్లపైనే




పేదరికాన్ని, వివక్షను నిర్మూలించటంలో అవినీతి నిర్మూలన ఎంత కీలకమో అంతర్జాతీయ ద్రవ్యనిధి తాజా అంకెలు కూడా తెలియచెప్పాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఏటా సుమారు కోటి కోట్ల నుంచి రూ. 1.34 కోట్ల వరకు లంచాల రూపంలో స్వాహా అవుతున్నట్టు అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) వెల్లడించింది. ఈ మొత్తం ప్రపంచ జీడీపీలో 2శాతంగా ఉన్నట్టు ఐఎంఎఫ్ నివేదిక తెలిపింది. ఫలితంగా, ఆర్థిక వృద్ధి, పేదలకు అవసరమైన కనీస సేవలు తగ్గడం జరుగుతోందని పేర్కొంది. ఆర్థిక వ్యవస్థపై అవినీతి హానికర ప్రభావం చూపుతున్నట్టు ఐఎంఎఫ్ ఎండీ క్రిస్టీన్ లగార్డే వ్యాఖ్యానించారు. లండన్‌లో జరిగిన అవినీతి వ్యతిరేక సదస్సు సందర్భంగా రాసిన ఓ వ్యాసంలో ఆయన ఈ అంశాల్ని పేర్కొన్నారు. అవినీతి దేశీయ, విదేశీ పెట్టుబడుల్ని ఆటంకపరిచి విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి సామాజిక వ్యయాలు తగ్గేందుకు దారితీస్తుందనీ, ఇది పేదలకు అత్యంత నష్టమని లగార్డే అన్నారు. చట్టబద్ధ పాలనను బలోపేతం చేయాలని, లంచాలు ఇచ్చేవారిని, పుచ్చుకునేవారినీ ప్రోత్సహించకుండా ఉండేందుకు పారదర్శకతను పెంచాలని లగార్డే కోరారు. ప్రయివేటు, రాజకీయ ప్రభావాలకు అతీతంగా ఉండే ప్రభుత్వ అధికారులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పనామా పత్రాల వ్యవహారం బయటపడటంతో ప్రపంచస్థాయిలో అవినీతిపై అందరి దృష్టి పెరిగినట్టు ఈ పరిణామాలు స్పష్టంచేస్తున్నాయి.

అవినీతి.. ప్రభుత్వ ఆదాయ పెంపును, ప్రజాసేవల్ని పెంపొందించే అవకాశాల్ని బలహీనపరుస్తున్నట్టు ఐఎంఎఫ్ నివేదిక తెలిపింది. దేశానికి ఆదాయం పెంచుకునే సామర్థ్యాన్ని, కీలక పనులు చేయగలగడాన్నీ బలహీనపరుస్తోందని, లంచాలు పన్ను ఎగవేతను పెంచుతాయని పేర్కొంది. ప్రభుత్వ వ్యయంలో నాణ్యతను, పరిమాణాన్ని అవినీతి దెబ్బతీస్తుందని హెచ్చరించింది. బడ్జెటేతర లావాదేవీల ద్వారా నిధులు దారి మళ్లడంతో ప్రభుత్వ పెట్టుబడులకు, ఇతర ప్రాధాన్య ఖర్చులకు లభ్యత తగ్గుతుందని పేర్కొంది. మౌలిక సదుపాయాలకు కొరత తలెత్తి, వృద్ధిపై ప్రభావం చూపుతుందని వివరించింది. ప్రభుత్వ ఆదాయం తగ్గటం వల్ల ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉ ందనీ, ద్రవ్య వ్యవస్థ సుస్థిరత బలహీనపడుతుందనీ, చివరిగా అవినీతి అనేది ఫైనాన్స్ మార్కెట్లలో అనుసంధానత వ్యయాన్నీ పెంచుతుందనీ, ప్రయివేటు రంగంలో మరింత ప్రభావం పడుతుందని వివరించింది. 'వృద్ధి, స్థూల ఆర్థిక సుస్థిరతకు అవినీతిపై పోరు కీలకం' పేరిట ఈ నివేదికను రూపొందించారు. ❍

# ఆశ్రిత పెట్టుబడికి అడ్డుకట్ట వేయటం

- డాక్టర్ కల్లూరు శివారెడ్డి,
ఆర్థిక రంగ నిపుణులు



పాతికేళ్ల క్రితం ప్రారంభమైన ప్రపంచీకరణ విధానాలు కొన్ని దుష్పరిణామాలకూ దారితీశాయి. వాటిలో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం (క్రోనీ క్యాపిటలిజం) ఒకటి. ప్రభుత్వ అనుమతులపై ఆధారపడి వ్యాపారం చేసే వ్యక్తులు రాజకీయ, ప్రభుత్వ యంత్రాంగాలలో చొరబడటం, వారి నుంచి అనైతిక రీతిలో ప్రయోజనాలు పొందటం ఎప్పటి నుంచో ఉన్నదే. అయితే, అది అమాంతంగా పెరగడం మాత్రం ప్రపంచీకరణ రోజుల నుంచే ప్రారంభమైంది. అలాంటి వ్యాపార సంపద కనీవినీ ఎరుగనిరీతిలో పెరిగింది. అవినీతి ప్రబలింది. క్రోనీ క్యాపిటలిజం, అవినీతి ఒకదానికి ఒకటి తోడై ప్రజా సంపదను కొల్లగొట్టాయి. ఆశ్రిత పెట్టుబడిదారుల వ్యక్తిగత సంపద పెంచాయి. ఎకానమిస్ట్ (2016) పత్రిక గణాంకాల ప్రకారం, 2004 నుంచి 2014 మధ్యకాలంలో ప్రపంచ ఆశ్రిత బిలియనీర్ల సంపద విలువ 385 శాతం పెరిగి రెండు లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఫలితంగా ఆర్థిక వ్యవస్థలు తమ పూర్తి సామర్థ్యాన్ని చూపలేకపోయాయి. ప్రజల్లో ఆర్థిక అసమానతలు పెరిగాయి. కానీ, కొన్నేళ్లుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనం, అంతర్జాతీయంగా తగ్గిన చమురు, ఇతర ఉత్పత్తుల ధరలు, రాజకీయాల్లో వచ్చిన మార్పులు, ఆశ్రిత పెట్టుబడిదారుల సంపదపై ప్రతికూల ప్రభావం చూపాయి. దరిమిలా ప్రపంచవ్యాప్తంగా వీరి సంపద తరిగి 2016 నాటికి 1.75 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇండియాలో ఆశ్రిత పెట్టుబడిదారుల సంపద స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 3.4శాతంగా ఉంది. ఆశ్రితేతర రంగ సంపద కేవలం 8.3శాతం. దేశ స్థూల జాతీయోత్పత్తిలో ఆశ్రిత బిలియనీర్ల సంపద శాతం ఆధారంగా 22 దేశాలపై 'ఎకానమిస్ట్' రూపొందించిన ప్రపంచ క్రోనీ క్యాపిటల్ సూచీ (2016)లో ఇండియా ర్యాంకు తొమ్మిది. ఈ ర్యాంకుల్లో అత్యధిక ఆశ్రిత సంపదతో రష్యా మొదటిస్థానంలో ఉండగా, జర్మనీ 22వ స్థానంలో ఉంది. వాస్తవానికి ఇండియా ర్యాంకు 2014లో కూడా తొమ్మిదే అయినప్పటికీ– ఆశ్రిత సంపద మాత్రం జీడీపీలో 3.62శాతం ఉండేది. 2014లో కేంద్రంలో ప్రభుత్వం మారడం, అది నల్లధనం, అవినీతిపై కొంత కటువుగా ఉండటం వల్ల దేశంలో క్రోనీ క్యాపిటలిజం కొంత తగ్గుముఖం పట్టింది. కానీ, వీటి మూలాలను పెకిలించినప్పుడే ప్రజలందరికీ ప్రజాస్వామ్య ఫలాలు అందుతాయి!

**విషవలయం**

ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ఎప్పటి నుంచో చాప కింద నీరులా చొచ్చుకువచ్చింది. ఉదాహరణకు గనుల రంగంలో ఒక వ్యాపారవేత్త ఉన్నారనుకొందాం. అతను రాజకీయ, ప్రభుత్వ యంత్రాంగాన్ని డబ్బుతో ప్రలోభపెట్టి తనకు కావలసిన పనులు చేయించుకుంటాడు. చెరువులు, గుట్టలు సైతం ఆక్రమించి, వేలకోట్ల రూపాయల విలువ చేసే సంపద కొల్లగొడతాడు. ప్రజలు మాత్రం నిరుపేదలుగా ఉండిపోతారు. అతడే ఆశ్రిత పెట్టుబడిదారు. కొంతమంది వ్యాపారవేత్తలు ప్రభుత్వ యంత్రాంగంతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకుని, తమకు కావలసినవి ప్రభుత్వం నుంచి పొందుతూ, అవినీతిని ప్రోత్సహిస్తూ వారి వ్యాపారాలను పెంచుకుని, తద్వారా సంపదను వృద్ధి చేసుకోవడమే క్రోనీ క్యాపిటలిజం. వ్యాపారానికి చట్టపరమైన అనుమతులు, సహజ వనరులు, ప్రభుత్వ నిధులు, ప్రత్యేక పన్ను మినహాయింపులు వంటి విషయాల్లో ప్రభుత్వ యంత్రాంగం అవినీతికి పాల్పడి, కొందరు వ్యాపారవేత్తలకు, సంస్థలకు ప్రయోజనం చేకూర్చడమే దీని అసలు రూపం. టెలికాం, సహజ వనరులు, స్థిరాస్తి, నిర్మాణ, రక్షణ వంటి రంగాల్లో వ్యాపార అనుమతులు తెచ్చుకోవడానికి, కొన్ని ప్రోత్సాహకాలు పొందడానికి ప్రభుత్వ యంత్రాంగంతో పదే పదే సంప్రతింపులు జరపాల్సి వస్తుంది. ఈ ప్రక్రియలో పరస్పర ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యం ఉంటుంది. వ్యక్తిగత ప్రయోజనాలను ప్రజా

ప్రయోజనాలుగా మార్చడానికి ప్రయత్నిస్తారు. పారదర్శకతను పక్కన పెడతారు. ప్రభుత్వంలోని అవినీతి యంత్రాంగం జాతి వనరులు, సంపదలను విపణి ధరల కన్నా తక్కువకు ఈ వ్యాపారులు ఉపయోగించుకోవడానికి అనుమతులు ఇస్తుంది. అందుకోసం వ్యాపారులు కూటములు కట్టి, లాబీయింగ్ చేస్తారు. అది గుత్తాధిపత్యానికి దారితీస్తుంది. ఫలితం ఈ వ్యాపారులు అదనంగా ఎటువంటి విలువనూ సృష్టించకుండా తాము ఉత్పత్తి చేసినవాటికి అధిక ధర నిర్ణయించి ఎక్కువ లబ్ది పొందుతారు. ఈ ఒప్పందాల్లో అవినీతి ఉంటుంది కానీ, అవి చట్టబద్ధంగా ఉంటాయి!

క్రోనీ క్యాపిటలిజం ఒక విషవలయం. అది పుట్టడానికి ప్రధాన కారణం ప్రభుత్వ సేవలు లక్షిత వర్గాలకు చేరకపోవడమే. నిజానికి ప్రజాశ్రేయం కోసం ప్రభుత్వం అందజేసే సేవలు అన్ని వర్గాల ప్రజలకూ అందాలి. దురదృష్టవశాత్తూ విధానాల్లో లోపాల వల్ల పేద, అణగారిన ప్రజలకు ప్రభుత్వ సేవలు సరిగ్గా అందవు. కొన్ని ప్రాంతాల్లో చౌక దుకాణాల సరకు పేదలకు చేరదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు అధ్వాన్నంగా ఉంటాయి. మందులు ఉండవు. సిబ్బంది కొరత వెక్కిరిస్తుంటుంది. ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయులు కనపడరు. పోలీసు స్టేషన్లు ఉంటాయి కానీ, ధనికులు, శక్తిమంతులు నేరం చేసినా వారిపై కేసులు నమోదు కావు. పేదవారు తమ హక్కుగా పొందాల్సిన ఈ ప్రభుత్వ సేవలను వారు కొనుగోలు చేయాల్సిన దుస్థితి దాపురిస్తుంది. అందుకు వారి దగ్గర తగిన డబ్బులుండవు. కానీ, రాజకీయ నాయకులకు కావలసిన ఓట్లు వారి వద్ద ఉంటాయి. ఈ పరిస్థితులే అవినీతి రాజకీయ నాయకుల పుట్టుకకు దారితీస్తున్నాయి. రాజకీయ నాయకుడు ఈ పేదవారి కోసం ఒక పాఠశాల సీటో, ప్రభుత్వ ఉద్యోగమో ఇప్పిస్తాడు. కొంత పొలమో, ఆర్థిక సాయమో అందచేస్తాడు. వారి తరపున ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తాడు. దాంతో ఆ పేద, అణగారిన ప్రజలు తమ కోసం ఆ నాయకుడు ఎన్నో చేస్తున్నాడని భావిస్తారు. వారికి ఓట్లు కూడా వేస్తారు! కొంతమంది నిజాయతీగల రాజకీయ నాయకులు చిత్తశుద్ధితో తమ ఓటర్ల స్థితిగతులను మెరుగుపరచాలనుకుంటారు. వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని ఆశిస్తారు. కానీ, ఆ ప్రక్రియ అంతా అధిక సమయం తీసుకునే తతంగమని, ఒక్క నాయకుడి వల్ల ఏమీ ఒరగబోదని ప్రజలు భావిస్తారు. ఏదో విధంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని పనిచేయించి, తమకు ఎంతో కొంత మేలు చేసే అవినీతికర రాజకీయ నాయకుడి వైపు మొగ్గు చూపుతారు. అతడి చర్యల వల్ల వ్యవస్థ అవినీతిమయ మవుతున్నా పట్టించుకోరు. ఎన్నికలు ఎదుర్కోవడానికి రాజకీయ నాయకుడికి డబ్బు కావాలి. అంటే రాజకీయ నాయకుడికి డబ్బిచ్చే వ్యాపారవేత్త కావాలి. కాంట్రాక్టులు, ప్రజా వనరులు ప్రభుత్వం నుంచి చౌకగా పొందడానికి అవినీతి వ్యాపారవేత్తకు అదే తరహా రాజకీయ నాయకుడు కావాలి. రాజకీయ నాయకుడికి పేద, అణగారిన ప్రజల ఓట్లు కావాలి! ఈ విషవలయం ఇలాగే కొనసాగుతుంది. నిజాయతీగల రాజకీయ నాయకులు, ప్రభుత్వం ఈ విషవలయాన్ని తెగ్గొట్టటానికి ప్రయత్నిస్తారు. కానీ, అది అంత సులభం కాదు.

## పెరిగిన పారదర్శకత

క్రోనీ క్యాపిటలిజాన్ని ఎదుర్కోవాలంటే ప్రభుత్వ లైసెన్సింగ్ విధానాల్లో పారదర్శకత తీసుకురావాలి. ఆర్థిక వ్యవస్థలు పరిపక్వత చెందే కొద్దీ ఈ తరహా పోకడలు తగ్గుముఖం పడతాయి. ధనిక దేశాల్లో ఇలాంటి వ్యాపారులు తక్కువగా ఉండటమే దీనికి నిదర్శనం. అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రపంచ జీడీపీలో 43శాతం కలిగివుంటే, ప్రపంచ ఆశ్రిత సంపదలో 65శాతం కలిగి ఉన్నాయి! ధనిక దేశాల్లో ఆశ్రిత సంపద వాటి జీడీపీలో 2008 నుంచి స్థిరంగా 1.5శాతంగానే ఉన్నప్పటికీ, వర్ధమాన దేశాల్లో అది ఏడు శాతం నుంచి నాలుగు శాతానికి తగ్గింది. ఇండియాలో పరిస్థితి కొంత ఆశాజనకంగానే ఉందని చెప్పొచ్చు. 2008లో రష్యాకు సమానంగా (18శాతం) ఉన్న ఆశ్రిత సంపద 2016 నాటికి గణనీయంగా తగ్గింది. వస్తు ఉత్పత్తుల ధరల్లో వచ్చిన తగ్గుదల మైనింగ్ రాజుల ఆస్తులను కూడాకకుదించింది. అంతేకాక, 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం అవినీతిపై కొంత కఠిన వైఖరి అవలంబించింది. బొగ్గు గనులు, టెలికాం 2జీ స్పెక్ట్రం వ్యాపార అనుమతులు మునుపటి ప్రభుత్వానికన్నా భిన్నంగా బహిరంగ వేలంలో కేటాయించడం వల్ల ఆ రంగాల్లో పారదర్శకత పెరిగింది. అవినీతి తగ్గింది. అంతేకాక కార్పొరేట్ బాబులు కోరిందే అదనుగా అర్హతకు మించి రుణాలిచ్చే ప్రభుత్వ రంగ బ్యాంకులపై నిబంధనలను రిజర్వు బ్యాంకు కఠినతరం చేయడమూ దేశంలో క్రోనీ క్యాపిటలిజం తగ్గుదలకు కొంత దోహదపడింది. ఇండియాలో ఇప్పుడు కోటీశ్వరులు బహిరంగ పరిశ్రమలైన ఫార్మా, ఆటోమొబైల్, వినియోగ వస్తువుల నుంచి వస్తున్నారు. దీనికితోడు ప్రభుత్వం ప్రజాసేవల్లో నాణ్యత పెంచి, వాటి సరఫరాను సమర్థంగా అందించాల్సినవారికి అందించగలిగితే ప్రజలు అవినీతి రాజకీయ నాయకులపై ఆధారపడటం తగ్గుతుంది. తద్వారా ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని కట్టడి చేయవచ్చు!

**"అక్రమ వ్యాపారులు, ప్రభుత్వంలో ఉండే అవినీతిపరులైన రాజకీయ నాయకులకు మధ్య ఉండే సంబంధాలు వ్యవస్థలో పారదర్శకత, పోటీతత్వాన్ని దెబ్బతీస్తున్నాయి. అది స్వేచ్ఛా వాణిజ్యానికి, ప్రజల మధ్య సమానావకాశాలకు, దేశ ఆర్థిక వృద్ధికి, ప్రజాస్వామ్య స్వేచ్ఛకు హానికరం"** –రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురాం రాజన్

(ఈనాడు సౌజన్యంతో) ❍

# మోదీ, సీఎంలను మించిన హీరోయిజం చూపిన ఆనంద్

పొరుగున ఉన్న పాకిస్తాన్‌పైన, ఉగ్రవాదులపైన, చివరకు మావోయిస్టులపైన కూడా సైనికదాడులను వెరకవకుండా చేసే ప్రధాని నరేంద్ర మోదీ స్వదేశంలోని ప్రభుత్వోద్యోగులను చూసి మాత్రం జంకుతున్నారు. దేశాన్ని కాపాడే సైన్యం కంటే దాదాపు ఏడు రెట్లు ఎక్కువగా ఉండే సర్కారీ ఉద్యోగులు దేశ సమగ్రతను అంతర్గతంగా రక్షిస్తూ అభివృద్ధి చేయటంలో కీలకమైనవాళ్లు. వాళ్లలో అనేకమంది భయంకర అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ, ప్రజల పట్ల బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తున్నా చర్యలు తీసుకునే సాహసాన్ని మోదీ చేయలేకపోతున్నారు. పైగా దేశంలో ఏటా కొత్తగా రెండు కోట్ల మందికి ఉద్యోగాలు అవసరమవుతున్నా వారి ఉపాధి కోసం నిధుల్ని వెచ్చించకుండా.. రూ.1లక్ష కోట్లకు వెచ్చించి ప్రభుత్వోద్యోగులకు జీతాల్ని భారీస్థాయిలో పెంచారు. తాను వ్యక్తిగతంగా నిజాయతీపరుడ్నని చెప్పుకుంటున్నారుగానీ, దేశంలో అవినీతికి ప్రధానకారణమైన ఉద్యోగవ్యవస్థలో అవినీతిని అరికట్టడానికి వ్యవస్థను మాత్రం మోదీ ఏర్పాటు చేయలేకపోతున్నారు. ఉద్యోగుల అవినీతిపై ఆరోపణలు వస్తే విచారణకు అనుమతి వెంటనే లభించకుండా లోక్‌పాల్ అనుమతి తీసుకోవాలనే 17 'ఏ'ను అవినీతి నిరోధక చట్టంలో చేర్చటం, విధిలేక లంచం ఇచ్చినా ఆ సామాన్య ప్రజలు కూడా దోషులేననటం వంటి దుర్మార్గమైన సవరణలను మోదీ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ సవరణల్ని తొలగించాలంటూ లోక్‌సత్తా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి, ఎంపీలకు లేఖలు రాసింది. అలాగే తెలుగు రాష్ట్రాల్లో కూడా ప్రభుత్వోద్యోగుల చేత పనిచేయించే సాహసాన్ని పాలకులు చేయలేకపోతున్నారు. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కొంత చొరవ చూపి ప్రభుత్వ కార్యాలయాల్లో సకాలంలో ప్రజలకు పనిచేయకపోతే రోజుకు ఇంతని పరిహారంగా చెల్లించే 'పౌరసేవల గ్యారంటీ' చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పౌరసరఫరాల సంస్థ కమిషనర్ సీవీ ఆనంద్ కొంత సాహసోపేతమైన పనితీరును ప్రదర్శించారు. అవినీతి ఉద్యోగులను వెనకేసుకురాకుండా పబ్లిగ్గా ఎండగట్టారు.



"ఏం రోగం మీకు..చేతులు చాచకుండా బతకలేరా?.. పౌరసరఫరాల సంస్థను చంపేస్తారా? సంస్థ మీకు జీతాలిస్తోంది గదా? అయినా.. పర్సంటేజీల్లేకుండా బతకలేరా?" అని ఆనంద్ నిప్పులు చెరిగారు. "కొందరు మారుతున్నా సాంకేతిక సిబ్బందిలో మార్పు రావడం లేదు. ధాన్యం కొనుగోలులో ప్రతి 270 క్వింటాళ్లకకోటాకు ఒక ధర నిర్ణయించి లంచం వసూలు చేస్తున్నారు. 60శాతం మంది మిల్లర్లు మంచివారే.. 30శాతం మీతో కుమ్మక్కయారు. మిగిలిన 10శాతంపై ఆరోపణలు వున్నాయి. సంస్థను చంపకండి.. బతికించుకోండి.. గృహనిర్మాణ సంస్థ మన కళ్ల ముందే కనిపిస్తోంది గదా. ప్రధాన కార్యాలయం నుంచి ఎవరూ మిమ్మల్ని డబ్బులు అడగరు" అని స్పష్టం చేశారు. అధ్వాన్న వ్యవస్థలో ఒక అధికారి పూర్తిస్థాయి పనితీరుని కనబరిస్తే ప్రజలకు 20శాతం అదనంగా పనిచేయగలరు. కానీ వ్యవస్థ సక్రమంగా ఉంటే.. అదే అధికారి 80శాతం దాకా ప్రజలకు మేలుచేయగలుగుతారు. మోదీ, చంద్రబాబు లాంటి చాలామంది ముఖ్యమంత్రులు కూడా భయపడే బాధ్యతను చక్కగా నెరవేర్చిన ఆనంద్‌లాంటి అధికారుల వల్ల దేశానికి ఇంకా మేలు జరగాలంటే పౌరసేవల చట్టం, ఏసీబీకి స్వయంప్రతిపత్తి, పటిష్టమైన లోకాయుక్త, పోలీసు, న్యాయ, ఎన్నికల వ్యవస్థల ప్రక్షాళణ వంటి సంస్కరణలు అవసరం. ❍

# ప్రజాప్రతినిధులకు గుణపాఠం

- మహేష్ విజాపుకర్



కొత్త నవీ ముంబయి కమిషనర్‌గా నియమితులైన తుకారాం ముండే ఉదయం నడకకు వెళ్లినప్పుడు పౌరులు తమ సమస్యలు వినిపిస్తూ ఉంటే నిర్ఘాంతపోవాల్సి వచ్చింది. అధ్వాన్నమైన ఫుట్‌పాత్‌లు, బస్సు సర్వీసులు, నీటి సరఫరా, మురుగు కాలువలు, చెత్త, మురికివాడలు వగైరా.. వారు ఏకరువు పెట్టిన సమస్యలను వార్డు కార్యాలయాలకు లేదా కార్పొరేటర్ల ద్వారా కార్పొరేషన్‌కు చెబితే సరిపోతుంది.

కానీ ఎక్కడో తప్పు జరిగిందని అనిపిస్తోంది. ఒకటి, కార్పొరేషన్ ఆ నగరం కోసం లేదా నగర పౌరుల కోసం పనిచేయటం లేదు. ప్రజలకూ, వారు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులకూ మధ్య బంధం తెగిపోయింది. స్థానిక ఎన్నికల్లో నగరం పట్ల చిత్తశుద్ధికి తప్ప భావజాలానికి తావు లేదు. అయినా ప్రజాప్రతినిధులు వచ్చే మునిసిపల్ ఎన్నికల్లో నగర సంక్షేమంపైగాక, తమ భావజాలంపై ఆధారపడి ఓట్లు అడుక్కోవడమో లేదా కొనుక్కోవడమో చేస్తారని అనిపిస్తోంది. కాబట్టి ముండే రోజువారీ కాలినడక కాస్తా అధికారిక విధుల్లో భాగంగా మారిపోయింది.

పౌర సమస్యల పరిష్కారం కోసం ఆయన చేపట్టిన చర్యలు ఓ అరుదైన పర్యవసానానికి దారితీశాయి. ఇటీవల కమిషనర్‌పై విశ్వాస రాహిత్య తీర్మానానికి అనుకూలంగా 104 మంది కార్పొరేటర్లు ఓటు చేయగా, ఆరుగురు మాత్రం ఆయనకు మద్దతు తెలిపారు. ఈ తీర్మానాన్ని ఆమోదించటంలో అన్ని రాజకీయ పార్టీల కార్పొరేటర్లు ఒక్కటయ్యారు. అయినా, ఈ తీర్మానం ప్రజాస్వామిక సంస్థల పరిరక్షణ కోసం చేపట్టిన చర్య అనే వాదనను అంగీకరించను. ఇది నిజానికి, నగర కమిషనర్లు, రాజకీయవేత్తలు కుమ్మక్కయ్యే తమ పద్ధతుల పరిరక్షణ కోసం చేపట్టిన చర్య మాత్రమే.

ఎనిమిదేళ్ల కంటే తక్కువ కాలంలోనే ఎనిమిది బదిలీలను చూసిన కర్తవ్యదీక్షాపరుడైన ఐఏఎస్ అధికారి ముండే.. ఈ వ్యవహారం అంతటికీ మూలం ఏమిటనే దాన్ని పట్టుకున్నారు. నిర్దిష్టంగా కేటాయింపులు లేకుండా, స్థూల పద్దుల కింద రూ. 2,000 కోట్ల వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు. తద్వారా కార్పొరేటర్లకు అనువైన రీతిలో నిధుల మళ్లింపునకు వీలుండేలా చేశారు. మునిసిపల్ చట్టాల ప్రకారం కమిషనర్ పరిపాలకుడు మాత్రమే. ఇక మేయర్లదైతే నామమాత్రపు పాత్రే. ముండే నగరపాలకునిగా తన అధికారాలను ఉపయోగించసాగారు.

ఐదు నెలల్లో మిన్ను విరిగి మీద పడింది. ఒక స్మారక చిహ్నానికి చలువరాతి తాపడం చేయడానికి రూ. 2కోట్ల ప్రణాళిక అనవసరమంటూ దాన్ని రద్దు చేశారు. రూ. 167 కోట్ల సోలార్ పార్క్ విషయంలోనూ అదే పని చేశారు. కొనుగోలుదారు ఎవరూ లేకుండా దాన్ని చేపట్టడమే అందుకు కారణం. ఆ ప్రాజెక్టు ప్రణాళికలో కొనుగోలుదారుని వెతికే అంశం సైతం లేదు. కచ్చితమైన చర్యలను చేపట్టడంతో పక్కనే వున్న ముంబయిలో మునిసిపల్ ప్రజారవాణా వ్యవస్థ మెరుగుపడిన దృష్ట్యా ముండే కొరతగా వున్న నిధులను పౌరసదుపాయాలకు మళ్లించాలని నిర్ణయించారు.

పురపాలక సంస్థలు స్థానిక స్వయం పరిపాలనా సంస్థలు. కాబట్టి ఎన్నికైన ప్రజాప్రతినిధులను పూర్తిగా పక్కన పెట్టేయటం ప్రజాస్వామ్యంలో జరగదగినది కాదు. కానీ, నగరాన్ని, నగర అవసరాలను తక్కువ ప్రాధాన్యం కలవిగా చూడటం ద్వారా కార్పొరేటర్లు తమంతట తామే ఈ పరిస్థితిని కొని తెచ్చుకున్నారు. వారు అతిశయాన్ని, ఆడంబరాల్ని నేర్చుకున్నారు. తమ నగరానికి సేవ చేయాలనే నిబద్ధతకు బదులుగా తమకు అనువైన ప్రత్యేక ప్రయోజన బృందాలను ఏర్పరచుకున్నారు. చాలా ఇతర నగరాలలో కూడా నవీ ముంబయి కనిపిస్తుండటం విచారకరం.

ముండేపై విశ్వాసరాహిత్యాన్ని కనీసం ఇంతవరకు ముఖ్యమంత్రి ఆమోదించకపోవడం, కమిషనర్‌ని మార్చడం జరగకపోవచ్చని సంకేతించడం సంతోషకరం. మునిసిపల్ చట్టాన్ని అనుసరించి కమిషనర్‌ను నియమించేది రాష్ట్ర ప్రభుత్వమే. ఎవరిని నియమిస్తారు, ఎంతకాలానికి అనే వాటిని నిర్ణయించేది నగర పాలక సంస్థ కాదు. ఎన్నికైన ప్రజాప్రతినిధుల పట్ల "గౌరవం"తో ఉండాలని మాత్రమే ముండేకి చెప్పారు. ఉద్దేశపూర్వకంగా నగరంపై ఆయన దృష్టిని కేంద్రీకరిస్తుండటం వల్ల కార్పొరేటర్ల అహాలు, అనుచిత ప్రయోజనాలు తునాతునకలైపోతున్నాయి.

మహారాష్ట్రలో ఇంతకుముందు కూడా కొందరు కమిషనర్లు ముండేలాగానే ప్రజాప్రతినిధులతో ఘర్షణ పడాల్సి వచ్చింది. కార్పొరేటర్లను దూరంగా ఉంచి నిబంధనల ప్రకారం ముంబయి కమిషనర్‌గా పనిచేసిన సదాశివ తినాయ్‌కార్, పూణెకి సంబంధించి అరుణ్ భాటియా అలాంటి వారే. టి. చంద్రశేఖర్‌కి థానే నగరం కోసం పనిచేసినందుకు విశ్వాసరాహిత్య తీర్మానం బహుమతిగా దక్కింది.


అక్రమార్జన కోసం రాజకీయం చేయడం పౌర జీవితం పాలిట శాపం. అవి నగరాలను, పట్టణాలను జీవించటానికి దుర్భరంగా చేశాయి. అక్రమ నిర్మాణాలు, అధ్వాన్నమైన రోడ్లు వగైరాలు ఈ అనర్థాన్ని కళ్లకు కడుతుంటాయి, అనుభవంలోకి తెస్తుంటాయి. నగర పాలక సంస్థ లక్ష్యాల ప్రాధాన్యాలను మార్చడమే ముండే చేసిన తప్పు. అంతే. అది 'ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులకు గుణపాఠం'.

(సాక్షి సౌజన్యంతో) ❍

# ఈ ప్రశ్నలకు సమాధానాల మీదే మన రాజకీయ వ్యవస్థ భవిష్యత్తు

- డా॥ జయప్రకాష్ నారాయణ్

రెండో ప్రపంచ యుద్ధం తరువాత స్వాతంత్ర్యం పొందిన దేశాల పాలనలో ఒక ప్రధాన లక్షణం కనిపిస్తుంది. ప్రజాస్వామ్యం ముసుగు ఉన్న సమాజాలలోను, నియంతృత్వం రాజ్యమేలుతున్న దేశాలలోను కూడా ఈ లక్షణాన్ని చూడవచ్చు. అదేమంటే, అధికారంలో ఉన్నవాళ్లు ప్రజాధనాన్ని ఏదో ఒక రూపంలో దొంగిలించటం, లేదా దోపిడీ సాయపడటం.



ఒకసారి అధికారంలోకి వస్తే ప్రజాధనాన్ని, స్వంత ఆస్తి కంటే దుబారా చేస్తారు. స్వంత డబ్బును చాలా పొదుపుగా, అతి జాగ్రత్తగా, ప్రతి రూపాయి ఆచితూచి ఖర్చు చేసేవాళ్లు ప్రజాధనాన్ని మాత్రం విచ్చలవిడిగా ఖర్చు చేస్తారు, దోచుకుంటారు. ఓ కారు స్వంతంగా వాడాలంటే ఎంత దూరానికి ఎంత పెట్రోలు ఖర్చవుతుందో లెక్కలు వేసుకుని చాలా పొదుపుగా, అవసరమైనంత మేరకు వాడుకుంటాం. అదే ప్రజాధనంతో నడిచే ప్రభుత్వ వాహనమయితే పిల్లల స్కూళ్లకు, పెంపుడు కుక్కల్ని పశువుల డాక్టరు దగ్గరకు తీసుకుపోవటానికి, వంటమనిషి కూరగాయల్ని కొనటానికి, దూరపు బంధువుల్ని ఓచోటి నుంచి మరోచోటికి తరలించటానికి– ఇలా ఏ మేరకయినా వాడుకోవచ్చు! అంతటితో ఆగితే ఫరవాలేదు. సొంతఫోను చాలా జాగ్రత్తగా వాడుకునే మనం, ప్రభుత్వ ప్రభుత్వ ఫోనంటే దేశంలో సుదూర ప్రాంతాలకు, ఇతర దేశాలకు యధేచ్ఛగా ఫోను చేసుకుని గంటల తరబడి మాట్లాడుకోవచ్చు! నెలకి ఇరవైవేలు జీతం పొందేవాళ్ల ఫోను వాడకం అదే నెలలో రెండు లక్షల రూపాయలకు మించిన సందర్భాలనేకం ఉన్నాయి. పెట్టే ఖర్చుకు, చేసే పనికి, వచ్చే ఫలితాలకు మధ్య ప్రభుత్వంలో ఏ మాత్రం పొంతన ఉండదు. ఓ మంత్రికో, చట్టసభ సభ్యుడికో, ఓ అధికారికో ప్రభుత్వం ఇంటి సదుపాయం కల్పిస్తే, కొంచెం ఇబ్బంది ఉందనో, వాస్తు ప్రకారం ఆ ఇంట్లో ఉంటే ఎక్కువకాలం పదవి ఉండదనో అనిపిస్తే లక్షల రూపాయాల ప్రజాధనం ఖర్చు చేయటానికి వెనుకాడరు. ఓ ప్రముఖ సోషలిస్టు నాయకుడు ఓ ఉన్నత పదవిని చేపట్టగానే అప్పటిదాకా బంగారంలాగా ఉన్న ప్రభుత్వ గృహాన్ని మరమ్మతులు చేసి తనకు అనుకూలంగా మార్చుకోవటం కోసం రెండు కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని ఖర్చుపెట్టాడని వార్తలొచ్చాయి. గాంధీ మార్గాన్ని గురించి, సామ్యవాదాన్ని గురించి ఉపన్యాసాలివ్వటం మాత్రం అలాంటివాళ్లు మానేది లేదు. ఓట్లు వేసి గెలిపించిన సామాన్యులు, పన్నుల డబ్బులు సమర్పించుకుని పాలకులను రాజభోగాలలో ఉంచే పౌరులు– కనీస ఆరోగ్య వసతికి, టీకాలకు నోచుకోక అకాలమరణం పాలవుతుంటే, ఈ 'నేతలకు' మాత్రం చిన్నపాటి అనారోగ్యం వస్తే లక్షల ఖర్చుతో వెంటనే విదేశాలలో వైద్యం చేయాలి! ఇక అంగరక్షకుల పేరుతో పెట్టే ఖర్చు అంతింతకాదు. ఎవ్వరూ పట్టించుకోని, ఎందుకూ కొరగాని, బతికినా, చచ్చినా లెక్కలేని వాళ్లను కూడా రక్షించటం ఈ దేశ ప్రజల బాధ్యతగా వాళ్లుకువాళ్లే చెప్పుకుని కోట్ల రూపాయల ప్రజాధనాన్ని తగలేస్తున్నారు. ఈ విధంగా తమ 'ప్రతిష్ట' పెరుగుతుందని భావించి జనాన్ని దోచుకుంటున్నారు. చివరికి నిజజీవితంలో హంతకులు, గూండాలు, ముఠానాయకులు, దోపిడిదారులుగా ఉన్నవాళ్లకు కూడా ప్రజాధనంతో రక్షణ కల్పించాలి. వాళ్ల దోపిడీ నిర్విఘ్నంగా కొనసాగటానికి మనమే మళ్లీ వాళ్లకు రక్షణ కల్పించాలి! మన వేళ్లతో మన కళ్లను మనమే పొడుచుకోవాలి!

**అక్రమార్జనే వృత్తి!**

ఈ దోపిడీ కేవలం దుబారా ఖర్చుకో, ప్రభుత్వం కల్పించే సదుపాయాలకో పరిమితమయితే కొంత మేరకు సరిపెట్టుకోవచ్చు కాని అంతటితో ఆగితే అధికారంలో మజా ఏముంది? ప్రజాధనాన్ని ప్రత్యక్షంగా దొంగతనం చేసి సొంత ఆస్తిగా మార్చుకోకపోతే ఇక ఇంత హైరానా, శ్రమ, రిస్కు ఎందుకు? అయినకాడికి లంచాలు మేయటం, తమకు కావలసిన అవినీతిపరుల్ని అందలాలెక్కించటం, వాళ్ల ద్వారా ప్రజాధనాన్ని దోచుకోవటం, సామాన్యులను నిలువుదోపిడీ చేయటం అధికారంలో భాగమయిపోయింది. ఓ రాజకీయ

నాయకుడు అకాలమరణం పొందితే మనం తరవాత ఎన్నో కథలు వింటున్నాం. కోట్లకొలది అక్రమంగా సంపాదించిన డబ్బును- మిత్రులు అని నమ్మి వాళ్ల దగ్గర దాచిపెడితే, ఆ మనిషి పోగానే వాళ్లు సొంతం చేసుకున్నారని, స్విస్ బ్యాంకులో దాచుకున్నారని, బాగా లంచాలు మింగి సంపాదించిన మంత్రి చనిపోగానే, గూఢచారి విభాగాలు ఆ కుటుంబం వెంటపడి అధికార పార్టీకి చెందాల్సిన ఆ డబ్బు ఎక్కడుందో చెప్పమని వేధించాయని- ఇలా ఎన్నో పుకార్లు... కొంత వాస్తవం, మరికొంత అతిశయోక్తి కలిపిన కథలు ప్రచారంలో ఉన్నాయి. ఒకసారి ప్రజల మద్దతుతోనో, అధినాయకుల అండతోనో, ఎన్నికలలో అక్రమాల ద్వారానో అందలం ఎక్కితే ఒక ఏదో రూపంలో అక్రమార్జన చేయటం వాళ్ల జన్మహక్కయిపోయింది. కొందరు మంత్రులు, అధికారులు నిజాయతీగా, నిక్కచ్చిగా, ముక్కుసూటిగా, ధర్మబద్ధంగా పనిచేస్తూ ఏటికి ఎదురీదుతున్నారు. అలాంటి కొద్దిమంది ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారు. అధిక సంఖ్యాకులు అధికారాన్ని సొమ్ముగా మార్చుకుంటున్నారు. ఉన్నతాధికారుల నియామకాలకు, ప్రాజెక్టుల అనుమతికి, పెద్ద కాంట్రాక్టులకు, ప్రభుత్వ కొనుగోళ్లకు, ప్రభుత్వ సంస్థల అమ్మకాలకు, లైసెన్సులకు ఇలా ఎక్కడ దొరికితే అక్కడ ఎడాపెడా దోచుకుంటున్నారు. వాళ్లు కోటి తింటే, లాలూచీ లంచం ఇచ్చినవాడు పదికోట్లు లాభపడుతున్నాడు. చివరికి నష్టపోయేది అమాయకజనం! మన ఆర్థిక వ్యవస్థలో ఇంతకుమించిన దోపిడీ మరొకటుంది. ప్రభుత్వంలో అధికారం చలాయిస్తున్నప్పుడు కేవలం ఖజానా డబ్బునే దోచుకోవాలంటే కొన్ని పరిమితులున్నాయి. ఎన్నో నిబంధనలు అడ్డొస్తాయి. వాస్తవానికి పనికిరాకపోయినా- పేరుకు ఆడిట్లు, లెక్కలు ఉన్నాయి. అలాగే లంచాల రూపంలో తినాలంటే ఓ స్థాయికి మించి సాధ్యం కాదు. అవతలివాడిని వేధించే శక్తి, లేదా వాడికి అప్పనంగా మరింత డబ్బు దోచుకునే అవకాశం ఉన్నప్పుడే లంచం ముడుతుంది. వేధించటం శ్రుతిమించితే ప్రజల నుంచి ప్రతిఘటన రావచ్చు. ఒక్కడికే మరీ ఎక్కువగా దోచుకునే అవకాశం ఇస్తే మిగిలినవాళ్లు ఎదురుతిరుగుతారు. ఆర్థికవ్యవస్థలో పోటీ వల్ల ఇష్టం వచ్చినట్లు చేసే అధికారం పరిమితం. కాబట్టి అసలు నిజంగా డబ్బు దోచుకునే అవకాశం మరొకటుంది. అది ఆర్థికసంస్థల మీద పెత్తనం. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎన్నో ఆర్థిక సంస్థలు ప్రభుత్వం అధీనంలో నడుస్తున్నాయి. ఆ సంస్థల మీద పూర్తి ఆధిపత్యం మంత్రులదే. ఆ సంస్థలలో ఉన్నతాధికారుల నియామకాలు, వాటి ప్రధాన నిర్ణయాలు, విధానాలు- అన్నీ పాలకుల ఆదేశాలననుసరించి జరుగుతాయి. కీలక స్థానాలలో ఉన్న అధికారులే ఆర్థిక వ్యవస్థను శాసిస్తారు. ఆ అధికారాన్ని దుర్వినియోగం చేయటం, చేతనయితే ఒక్క కలంపోటుతో, రెండో కంటికి తెలియకుండా, ఎవరూ విమర్శించే అవకాశం పెద్దగా లేకుండా- వేలకోట్ల రూపాయలను కైంకర్యం చేయవచ్చు! పనికిరాని ప్రాజెక్టులకు బ్యాంకులు వందలకోట్ల రూపాయలు అప్పులిచ్చినా, ఓ హర్షద్ మెహతాకు, ఓ కేతన్ పారిఖ్‌కు వందల కోట్ల రూపాయలు అక్రమంగా ముట్టినా, పెద్ద పెద్ద కంపెనీలలో అతి ఎక్కువ ధరకు ఆర్థిక సంస్థలు షేర్లును కొని డబ్బు అప్పజెప్పినా.. ఇవన్నీ మన పాలకులు ఆర్థిక సంస్థలను ఎడా పెడా దోచుకోవటం వల్ల జరుగుతున్నవే. తేడా ఏమంటే ఆర్థిక సంస్థల దోపిడీలో పోయేది ప్రజలు దాచుకున్న సొంత డబ్బు. ప్రభుత్వ ఖజానాను దోచుకుంటే పోయేది ప్రజలిచ్చిన పన్నుల డబ్బు. పన్న కట్టాక ఇక ఆ డబ్బు పోయినట్టుగా మనం భావిస్తాం. కానీ బ్యాంకుల్లోనో, యూనిట్ ట్రస్టులోనో, ఓ ఆర్థిక సంస్థలోనో డిపాజిట్లు పెడితే, షేర్లు కొంటే అది మన ఖాతాలోనే ఉందని, మనకు వడ్డీలను, డివిడెండ్లను ఇస్తుందని, షేరు ధర పెరిగి లాభాలను ఆర్జించి పెడుతుందని విశ్వసిస్తాం. మన పన్నుల డబ్బు దోచుకోవడంతో తృప్తి పడని పాలకులు, చివరికి మన సొంత డబ్బును దాచుకుంటే దాన్ని కూడా మింగేస్తున్నారు.

**కలంపోటుతో దోపిడీ!**

ఇటీవల- ప్రభుత్వ రంగ ఆర్థికసంస్థ యు.టి.ఐ. ఇరుకున్న కుంభకోణం ఇలాంటిదే. గత 37 సంవత్సరాలలో యు.ఎస్.64 పేరుతో ప్రజలు పొదుపుచేసుకున్న మొత్తాన్ని ప్రభుత్వ రంగ మ్యూచువల్ ఫండ్ యు.టి.ఐ వనూలు చేసింది. కొంతకాలంపాటు బాగానే డబ్బు తిరిగి ఇచ్చింది. యూనిట్ ధరలు కూడా పెరిగి సామాన్య ప్రజలు లాభపడ్డారు. 1992-93 కాలంలో షేర్ మార్కెట్ వేలంవెర్రి దేశమంతటా వ్యాపించటంతో వేల కోట్ల రూపాయలు ప్రజల నుంచి వసూలు చేశారు. సామాన్య ప్రజలు, మధ్యతరగతివారు క్యూలలో నుంచి మరీ తాము కష్టపడి పొదుపు చేసిన డబ్బును కట్టి యూనిట్లు కొనుక్కున్నారు. ఇక అప్పటి నుంచి ప్రారంభమైంది అసలు కథ. అధికారంలో ఉన్న వాళ్లు తమకు కావలసిన వాళ్లును, తమ మాట వినేవాళ్లను ఆర్థిక సంస్థలలో ఉన్నత స్థానాల్లో నియమించుకున్నారు. ప్రజలు దాచుకున్న డబ్బును తమకు నచ్చిన కంపెనీలలో షేర్లు కొనే నెపంతో 'దానం' చేశారు. ఆ కంపెనీలు వందలకోట్ల రూపాయలు సొమ్ము చేసుకున్నాయి. ఆ నాయకులు, అధికారులు కోట్లకు పడగలెత్తారు. యూనిట్ ట్రస్టు దివాళా స్థితికి చేరింది. రెండు కోట్ల కుటుంబాలు మొత్తం పెట్టిన డబ్బు పోయే పరిస్థితి వచ్చింది. 1998లో ఇలాంటి

పరిస్థితి వస్తే కేంద్ర ప్రభుత్వం మూడువేల కోట్లకు పైగా పన్నుల డబ్బును ఇచ్చి సంక్షోభంలో ఉన్న యు.టి.ఐని గట్టెక్కించింది. మళ్లీ ఇప్పుడు అలాంటి పరిస్థితే ఉత్పన్నమయింది. ఎనిమిది సంవత్సరాల క్రితం పదిరూపాయలు పెట్టుబడి పెడితే కనీసం నేటికి 30 రూపాయలవుతుందని ప్రజలు ఆశించారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం సాయం చేశాక, ఎనిమిదేళ్లు గడిచాక పది రూపాయలే తిరిగి ఇస్తామంటున్నారు! అంటే నాటి విలువలో మూడు రూపాయలు తిరిగి వచ్చిందన్నమాట! అదీ వేలకోట్ల రూపాయల పన్నుల డబ్బును ఇచ్చి యు.టి.ఐని నిలబెట్టాక! అంటే ప్రజలు తమ కుడి జేబులో నుంచి డబ్బులిచ్చి, ఎడమ జేబులోకి గతంలో ఎప్పుడో ఇచ్చిన పది రూపాయలకి బదులు మూడు రూపాయలు తిరిగి తీసుకోగలుగుతున్నారన్నమాట! దానిమీద ఆనవాయితీగా పార్లమెంటులో దుమారం, పత్రికలలో ప్రకటనలు, ప్రతిపక్షాల విమర్శలు, ప్రభుత్వం హామీలు- ఇవన్నీ చూస్తున్నాం. ఈసారి కొత్తదనం ఏమంటే సాక్షాత్తూ ప్రధానమంత్రి విమర్శలకు అలిగి రాజీనామా చేస్తానని బెదిరించటం, పాలకపక్షాలు ఆయనని బుజ్జగించి రాజీనామా ప్రతిపదనని విరమించేలా చేయటం, ప్రభుత్వం దృష్టిలో కథ సుఖాంతంగా ముగియటం! కానీ ప్రజలకు అది సుఖాంతం కాదు, ప్రభుత్వ ఖజానాకు అది సుఖాంతం కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థకు అది సుఖాంతం కానే కాదు.

**వ్యవస్థాగత మార్పులు అవసరం**

అధికార భారతీయ జనతా పార్టీకి, వారికి అండగా ఉన్న ఆర్.ఎస్.ఎస్‌కు అత్యంత సన్నిహితుడు, స్వదేశీ జాగరణ్ మంచ్‌లో ప్రముఖ పాత్రధారి అయిన ఎస్. గురుమూర్తి ఇటీవల ఓ ప్రముఖ పత్రికలో సంచలనాత్మకమైన ఆరోపణలు చేశారు. 1995లో రిలయన్స్ కంపెనీలో హడావుడిగా, రాజకీయ ఒత్తిళ్ల వల్ల భారీగా ధరలకు షేర్లు కొని, అందుకోసం రూ.1073 కోట్లు ఖర్చు చేశారని, అదే ఈ సంక్షోభానికి మూలమని గురుమూర్తి ఆరోపణ. రిలయన్స్ కంపెనీ ప్రమోటర్లకు అదే సమయంలో ఆరు కోట్ల షేర్లను చాలా ఉదారమయిన షరతులతో, ఆరేళ్ల కాలంలో వడ్డీ లేకుండా చెల్లించేలా తక్కువ ధరకు కేటాయించారు. అలా లెక్క చూస్తే ఆ షేర్లను రూ.61 చొప్పున ప్రమోటర్లు కొనుక్కున్నారు. అదేకాలంలో రెండు విడతలుగా 2.75 కోట్ల షేర్లను యు.టి.ఐ. రూ.1073కోట్లు ఇచ్చి, అంటే షేరుకి సగటున రూ.389 చొప్పున కొన్నది. అదే రేటుకు ఇతర ప్రభుత్వ ఆర్థిక సంస్థలు- జి.ఐ.సి, ఎల్.ఐ.సి కూడా కొన్నాయి. ఒక్క ఈ కొనుగోలు వల్ల రూ.1500 కోట్లు యు.టి.ఐ నష్టపోయిందని గురుమూర్తి వాదన. ప్రస్తుతం ఈ షేర్లు రూ.300 పలుకుతున్నాయి. అయితే ఈ లోగా బోనస్ షేర్లు ఇవ్వటంతో, యు.టి.ఐ షేర్లు రెట్టింపయ్యాయి. ఆ విధంగా ప్రస్తుత షేర్ ధరల ప్రకారం లెక్కకట్టినా, యు.టి.ఐ.కి కేవలం 6శాతం చక్రవడ్డీ లభించిందని గురుమూర్తి అంచనా. అంటే బ్యాంకులో డిపాజిట్ చేస్తే అంతకు రెట్టింపు ఆదాయం వచ్చేది. పోనీ 'చచ్చిన వాడికి వచ్చిందే కట్నం' అనుకుని ఆ మాత్రమైనా తిరిగి తీసుకుందామనుకుంటే అన్ని రిలయన్స్ షేర్లను కొనే నాథుడే లేడు. యు.టి.ఐ. ఆ షేర్లను అమ్ముతోందని తెలిస్తే మరుక్షణం ఆ షేరు విలువ సగానికిసగం పడిపోతుంది. ఇదీ మన ఆర్థిక సంస్థల నిర్వాకం. ప్రజలు దాచుకున్న డబ్బు వెయ్యికోట్ల రూపాయలతో ఆరు రెట్లకిపైగా ఎక్కువ ధరకు షేర్లను కొనటం ద్వారా ఆ మొత్తాన్ని రిలయన్స్ కంపెనీకి దానం చేసేశారు! 'అత్త సొమ్మును అల్లుడు దానం చెయ్యటం' అంటే ఇదే! చివరికి రిలయన్స్ కంపెనీ మన డబ్బుతో లాభపడింది. ప్రజల నెత్తిన టోపీ పడింది. అలాగే గత సంవత్సరం ప్రధానమంత్రి కార్యాలయం ఒత్తిడి వల్ల ఊరూ పేరూ లేని సైబర్ స్పేస్ ఇన్ఫోసిస్ కంపెనీలో పెద్ద ఎత్తున యు.టి.ఐ పెట్టుబడి పెట్టిందని, 600 పనికిరాని కంపెనీలలో, బోగస్ కంపెనీలలో వందల కోట్లు పెట్టుబడి పెట్టిందని పాలకపక్షాలలో ఒకటైన శివసేన పార్లమెంట్ సభ్యుడు సంజయ్ నిరుపమ్ రాజ్యసభలో ఆరోపణలు చేశారు.

ప్రజలు దాచుకున్న డబ్బును పాలకులు ఎలా దోచుకుంటున్నారో ఈ ఉదంతాలు బయటపెడుతున్నాయి. 1995 నుంచి నేటి దాకా ఇలాంటి జరగటంతో ఇందులో పాలకపక్షాలు, ప్రతిపక్షాలు అనే తేడాలు లేవని, అన్ని ప్రధాన పార్టీలు యథాశక్తిన ప్రజలను దోచుకోవటంలో పాలుపంచుకుంటున్నాయని తేటతెల్లమవుతోంది. దీనికి పరిష్కారం రాజీనామా బెదిరింపులు, సెంటిమెంట్లు, కోపతాపాలు, రాజకీయ ఒప్పందాలు కాదు. ఇప్పటికైనా తప్పులు చేసిన వాళ్లు శిక్షకు గురవుతారా? జవాబుదారీతనం నెలకొంటుందా? ప్రభుత్వంలో బాధ్యత ఉన్నవాళ్లు ప్రజాధనం దోపిడీలో పాలుపంచుకోకుండా, ప్రజాప్రయోజనాల రక్షణకు నిలబడేలా వ్యవస్థీకృతమైన మార్పుల్ని తెస్తారా? ఎన్నికలలో సంస్కరణల్ని తెచ్చి ప్రజల డబ్బుతో పాలకుల వ్యాపారంగా మారిన రాజకీయాన్ని మళ్లీ ప్రజాసేవకు అంకితం చేస్తారా? అక్రమార్జనపరుల్ని, దోపిడీదారుల్ని తరిమికొడతారా? ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాల మీద వాజపేయి ప్రతిష్ట, ఈ ప్రభుత్వ మనుగడ, ఈ రాజకీయ వ్యవస్థ భవిష్యత్తు ఆధారపడి ఉన్నాయి.

**(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా ఆగస్టు 6, 2000న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం)** ❍

# ఇంకా దండిగానే హుండీ నిధులు

రాజకీయాలు రాష్ట్రాల చుట్టూనే, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు దగ్గరగా ఉండే ప్రాంతీయ పార్టీల చుట్టూనే తిరుగుతున్నకొద్దీ అసెంబ్లీ ఎన్నికల ఖర్చు చుక్కలను తాకుతోంది. ఈ డబ్బంతా ఎక్కడ్నుంచి వస్తుంది అంటే సామూహిక ఆత్మవంచనకు అద్దం పట్టేలా ఒక బహిరంగ రహస్యాన్ని దాటవేయటం ఆనవాయితీగా మారింది. భారత రాజకీయాలలో ఇలా నల్లడబ్బు ప్రభావం ఉండకూడదనే తెహల్కా స్టింగ్ ఆపరేషన్‌ను ఒక అవకాశంగా మలచుకుని లోక్‌సత్తా 2003లో పార్టీల నిధులలో పారదర్శకతకు ఒక చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం వల్లే లోక్‌సత్తా పార్టీ, ఆ తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఏర్పడగలిగాయి. మంచి రాజకీయం మనుగడ సాగించటం సాధ్యమని నిరూపించటానికి ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడింది. అయితే డబ్బే రాజకీయంగా మార్చేసిన పార్టీలకు నిజాయతీతో వచ్చే డబ్బు చాలక అడ్డగోలుగా అక్రమంగా నిధుల్ని సేకరించటాన్ని కొనసాగిస్తున్నాయి. ఒక్క లోక్‌సత్తా తప్ప (దేశంలోనే తొలిసారిగా ఆదాయవ్యయ వివరాలను వెబ్‌సైట్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రజల ముందుంచిన పార్టీ లోక్‌సత్తా) బీజేపీ సహా ఏ పార్టీ

2014 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కో నియోజవర్గంలో అభ్యర్థులు, పార్టీలు లెక్కల్లో చూపకుండా చేసిన సగటు ఖర్చు
**రూ.45 కోట్లు**

మొత్తం 543 నియోజకవర్గాల్లో వెచ్చించిన నల్లధనం
**రూ.25 వేల కోట్లు**

ఉత్తర్ ప్రదేశ్‌లో 2012లో నిర్వహించిన శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు చేసిన మొత్తం నల్లధనం
**రూ.10 వేల కోట్లు**

దేశంలో సగటున ఒక్కో అసెంబ్లీ స్థానంలో ప్రధాన అభ్యర్థులు చేసిన ఖర్చు
**రూ.25 కోట్లు**

దేశవ్యాప్తంగా ఉన్న 4,120 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులు చేసిన సుమారు వ్యయం
**రూ.లక్ష కోట్లు**

దేశవ్యాప్తంగా స్థానిక సంస్థలు, పంచాయతీల్లో చేస్తున్న ఖర్చు, కొన్ని రాష్ట్రాల్లో ఉన్న శాసన మండలికి ఎన్నికయ్యేందుకు చేసే ఖర్చు:
**రూ.లక్ష కోట్లు**

.... వెరసి దేశంలో అయిదేళ్లలో జరిగే అన్ని ఎన్నికల్లో వ్యయమయ్యే నల్ల ధనం: సుమారు
**రూ.2,25,000 కోట్లు**

- మనదేశంలో ఎన్నికల్లో నల్లధన ప్రవాహంపై ఓ మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ లెక్క ఇది..

మహారాష్ట్ర, దక్షిణాది రాష్ట్రాల్లో అన్ని రకాల ఎన్నికల్లోనూ పార్టీలు, అభ్యర్థులు చేసే ఖర్చు చాలా ఎక్కువ. ఒడిశా, బిహార్ వంటి పేద రాష్ట్రాలు.. విస్తీర్ణం పరంగా చిన్నవిగా ఉండే ఈశాన్య రాష్ట్రాల్లో ఖర్చు కొంత తక్కువ. కొన్ని పార్లమెంటు నియోజకవర్గాల్లో పోటీని బట్టి, అభ్యర్థుల స్థాయిని బట్టి రూ.100 కోట్లు ఖర్చు చేసిన వారూ ఉన్నారు. అదే సమయంలో రూ.20 లక్షల్లోపు వ్యయంతోనే గెలిచినవారూ ఉన్నారు.



నిజాయతీగా డబ్బును సేకరించటం లేదని ప్రస్తుత కేంద్ర ఆర్థికమంత్రి, బీజేపీ సీనియర్ నేత అరుణ్‌జైట్లీ ఓ సందర్భంలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీతో సంభాషణలో ఒప్పుకున్నారు. అప్పటికి ఆప్ ఇంకా రాలేదు.

లెక్కల్లో చూపించే డబ్బులో కూడా నగదు ద్వారా తీసుకునే డబ్బు భారీగా ఉంటోంది. ఈ నగదులో కూడా హుండీ పద్ధతిలో, అంటే లెక్క తెలియకుండా సభలు, సమావేశాలలో సేకరించే నగదే ఎక్కువగా ఉండటంతో.. నగదుకు కొంత లెక్కలు చూపుతారు, మిగిలినదానికి లెక్కలుండవు. పార్టీలు చేసే ఖర్చుకు, చూపే ఆదాయం లెక్కకు అంతరం చూస్తే ఈ దొంగలెక్కలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది. అంటే, అనేకరెట్లు లెక్కలు చూపని డబ్బును హుండీ ద్వారా సేకరించవచ్చు. ఇలా వసూలు చేసింది సాంప్రదాయ పార్టీలకు అధికారికంగానే కొన్ని సందర్భాలలో చెక్కుల ద్వారా కంటే చాలా ఎక్కువగా ఉంటోంది. ఇటీవల అసోసియేషన్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫాంస్ సంస్థ విడుదల చేసిన గణాంకాలు కూడా ఈ చేదు వాస్తవాలకు అద్దంపట్టేలాగానే ఉన్నాయి. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలలో (2004-2015) వివిధ రాజకీయ పార్టీలకు నిధులు భారీగా నగదు రూపంలోనే అందాయని ఈ గణాంకాలు తెలిపాయి. మొత్తం నిధుల్లో 63శాతం (రూ.2100కోట్లకుపైగా) ఇలా అందాయి. ఈ 11 ఏళ్ల కాలంలో జరిగిన 71 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు నగదురూపంలో రూ.2,107.80 కోట్లు వసూలు చేశాయి. అసెంబ్లీ ఎన్నికల్లో చెక్కుల ద్వారా రూ.1,244.86కోట్లు వచ్చాయి. ఈ నిధుల సేకరణలో జాతీయ పార్టీల్లో రూ.1468.49కోట్లతో కాంగ్రెస్ పార్టీ మొదటిస్థానంలో, రూ.1128.156కోట్లలో బీజేపీ రెండో స్థానంలో నిలిచాయి. లోక్‌సభ ఎన్నికల్లో 45శాతం (రూ.1040కోట్లు దాకా) నగదు వచ్చింది.

### నిధుల సేకరణలో ఆప్‌కి రెండోస్థానం

నిధుల సేకరణలో స్థానిక పార్టీల్లో ఆప్ రెండో స్థానంలో నిలిచింది. సమాజ్‌వాదీ పార్టీ మొదటిస్థానంలో ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పీ రూ.187 కోట్లు వసూలు చేయగా ఆప్ 39 కోట్లు వసూలు చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో ఎస్పీ 2004 నుంచి ఇప్పటి వరకూ రూ.118 కోట్లు సేకరించగా, ఆప్ కేవలం 2014లోనే రూ.52 కోట్ల విరాళాల్ని సేకరించింది. తర్వాతి స్థానాల్లో అన్నాడీఎంకే, బిజూజనతాదళ్, శిరోమణి అకాలీదళ్ తదితర పార్టీలున్నాయి.

### తెలుగు నాట పార్టీల బడా చోర్ లెక్కలు

ఇతర రాష్ట్రాల్లో తీసుకున్న నగదుకు లెక్కలు చెప్పకపోయినా కాస్త పెద్దమొత్తంలోనే సాంప్రదాయ పార్టీలు విరాళాల్ని ప్రకటించగా ఒక్క 2014 ఎన్నికల్లోనే రూ.8,000 కోట్లు ఖర్చు పెట్టిన అంచనాలతో డబ్బు రాజకీయాలలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న తెలుగు నాట మాత్రం పార్టీలు బడా చోర్‌ల లెక్కన విరాళాల లెక్కలు సమర్పించాయి. గత పదేళ్లలో తెలుగుదేశం లోక్‌సభ ఎన్నికల్లో 19.71 కోట్లు సేకరించగా, టీఆర్ఎస్ 22.46 కోట్లు మాత్రమే సేకరించిందట. ఎన్నికల ఖర్చు తెదేపాకు రూ.23.01 కోట్లు, వైకాపాకు 18కోట్లు, తెరాసకు రూ.7.58 కోట్లేనట.

దేశంలో ఈవేళ బైటపడుతున్న వాటితో సహా పలు కుంభకోణాలకు మూలం ఎన్నికలలో భారీగా అక్రమాలకు, ఎజెండా లేకుండా జెండాలతో ఆర్భాటం చేయటానికి డబ్బును వెదజల్లాల్సి రావటం. ఇందుకోసం హుండీ నిధుల సేకరణతోపాటు హవాలా మార్గాల్ని కూడా పార్టీలు ఆశ్రయిస్తున్నాయి. దేశంలో లోక్‌సభ నుంచి స్థానిక ప్రభుత్వాల వరకు ఐదేళ్లలో జరిగే అన్ని ఎన్నికలకు కలిపి రూ.2,25,000కోట్ల నల్లధనం ఖర్చుచేస్తున్నారని ఓ మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ తెలిపారు. వీటిల్లో పట్టుబడేది చాలా తక్కువ. ఈ ఖర్చు చేసినవారు ఇంతకు ఇంత మళ్లీ సంపాదించుకుని వివిధ రూపాల్లో దేశాల్లో దేశ విదేశాల్లో దాచుకుంటారని వేరే చెప్పనక్కర్లేదు.

రాష్ట్రాలలో ప్రత్యక్ష ఎన్నికలు, దామాషా ఎన్నికల పద్ధతి, స్థానిక ప్రభుత్వాల సాధికారత, వార్డు స్థాయికి నేరుగా బడ్జెట్‌లో నుంచి నిధులు వంటి మార్పుల్ని తీసుకొస్తే చాలామేరకు ఈ డబ్బురాజకీయాన్ని కట్టడి చేయవచ్చు. అధికారంలోకి వచ్చిన సాంప్రదాయ రాజకీయ ఊబిలో కూరుకుపోయిన వారు ఇప్పటికైనా ఈ సంస్కరణలకోసం ప్రయత్నించకపోతే కాస్త ఆలస్యంగానైనా భారీ మూల్యం చెల్లించకతప్పదు. పెద్ద నోట్లు రద్దు చేయటానికి కొనసాగింపుగా వెంటనే ఈ వ్యవస్థీకృత ఎన్నికల మార్పుల్ని తీసుకురాకపోతే మోదీ ప్రభుత్వం కూడా ముమ్ముందు మూల్యం చెల్లించాల్సి వుంటుంది. ❍

# విద్యావ్యవస్థలో మార్పు కోసం ఆబాలగోపాలం ఒక్కతాటిపైకి రావాలి: జేపీ




**మ**నందరి అభివృద్ధికీ మాస్టర్ కీ నాణ్యమైన విద్యేనని, అందుకే ఇప్పుడున్న అధ్వాన్న విద్యావ్యవస్థను సమూలంగా మార్చేందుకు ఆబాలగోపాలం ఒకేతాటిపైకి రావాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు.

విద్యావ్యవస్థ, చట్టసభల్లో చర్చలపై నిర్వహిస్తున్న యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని అక్షరవనంలో నిర్వహించిన మొదటి 'బాలపార్లమెంట్'లో జేపీ ఛైర్‌పర్సన్‌గా పాల్గన్నారు. యూత్ పార్లమెంట్‌ను నిర్వహిస్తున్న ఎఫ్‌డీఆర్, వైబీఐతోపాటు మహబూబ్‌నగర్, వరంగల్ తదితర జిల్లాల్లో గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్న వందేమాతరం ఫౌండేషన్ కూడా కార్యక్రమానికి భాగస్వామిగా వ్యవహరించింది. ఈ ఫౌండేషన్ వారి 'ట్రిపుల్ ఎల్' (లాంగ్వేజ్, లాజిక్, లైఫ్ స్కిల్స్) కాన్సెప్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం కూడా పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తోంది.

బాలపార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నవారే. పాఠశాలల్లో టీచర్ల కొరత, తెలుగు మాధ్యమం, ఆటస్థలాలు, టాయిలెట్లు లేకపోవటం, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందకపోవటం, కనీస మౌలిక సదుపాయాలు వంటి అంశాలతోపాటు విద్యాప్రమాణాలపై సభ చర్చించింది. ఆయా అంశాలను ప్యానల్‌లోని పెద్దలు ప్రశ్నల రూపంలో విద్యార్థులను అడిగి సమాధానాలను, వారి అభిప్రాయాలను, సూచనలను తెలుసుకున్నారు. చర్చ నడుస్తున్నకొద్దీ విద్యార్థులు తమ ఆలోచనల్ని పంచుకునేందుకు చొరవ చూపారు. ప్రధానిగా, వివిధ శాఖలకు మంత్రులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. వారి సమస్యలకు, సందేహాలకు జేపీ పరిష్కారాలను అందించారు.

క్షేత్రస్థాయిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలని, వసతుల కల్పించటం, బోధనను పటిష్టం చేయటం అంశాలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జేపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ/ఎయిడెడ్ స్కూళ్లలో ఒక్కో విద్యార్థి మీద ఏటా రూ. 40వేలు ఖర్చు చేస్తోందని, కానీ అందుకు తగ్గ చదువు మాత్రం రావటం లేదని అన్నారు. దీనికి సంబంధించి తెలంగాణ విద్యాశాఖా మంత్రిని కూడా కలిసి పరిష్కారాలను చర్చించే ప్రయత్నం చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూస్తున్న తరుణంలో గ్రామీణ ప్రాంతాలలో వాటిని బలోపేతం










చేసేందుకు అక్షరవనం చేస్తున్న కృషి ప్రశంసనీయమని, చిన్న తరగతుల్లో మాతృభాషలో చదువుకు ప్రాధాన్యమివ్వాలని, పోటీప్రపంచానికి తగ్గట్టు ఆంగ్లంలో కూడా నైపుణ్యం సంపాదించుకోవాలని జేపీ సూచించారు.

కార్యక్రమంలో వందేమాతరం మాధవరెడ్డి, శ్రీపతిరెడ్డి, చిత్తరంజన్‌దాస్, శేఖర్, లోక్‌సత్తా బందారు రామ్మోహనరావు, పి.భాస్కరరావు, యూత్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ రవి రాఘవేందర్, ప్రతినిధులు ప్రదీప్, లక్ష్మీనరసింహ, శివరామకృష్ణ, జయంతి తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానం, చట్టసభల్లో ప్రజాస్వామిక చర్చలపై కళాశాల, విశ్వవిద్యాలయాల విద్యార్థులు, యువత భావాలను తెలుసుకుంటూ వారిలో అవగాహన పెంచేందుకు అక్టోబర్ 2, 2016న డా॥ జయప్రకాష్ నారాయణ్ దిశానిర్దేశంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ప్రారంభించిన యూత్ పార్లమెంట్‌ను ఆ తర్వాత కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. వర్సిటీల్లో నిర్వహించిన యూత్ పార్లమెంట్‌కు విశేష స్పందన లభించటంతోపాటు కొందరు స్కూలు పిల్లలు సైతం ఈ కార్యక్రమాల్లో నిర్మాణాత్మకంగా మాట్లాడటంతో.. రాబోయే తరాల్లో థాట్ లీడర్స్‌ని తయారుచేసే దిశగా బాల పార్లమెంట్‌ను కూడా నిర్వహించాలని జేపీ సూచించారు.

యూత్, బాల పార్లమెంట్‌లను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల్లోని విద్యాసంస్థల్లో నిర్వహించి జేపీతోపాటు సమాజంలోని వివిధ రంగాల ప్రముఖులతో చర్చించే అవకాశాన్ని విద్యార్థులు, యువతకు అందించాలని, వీరి నిర్మాణాత్మక ఆలోచనలను ప్రభుత్వానికి, సమాజానికి అందించాలని భావిస్తున్నట్టు ప్రతినిధులు తెలిపారు. ❍

# విద్యార్థుల సంఖ్యను బట్టే ప్రభుత్వ టీచర్లకు జీతాలివ్వాలి

- పి.రాజీవ్,
విద్యార్థిసత్తా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వం ఏ పనిచేసినా 'కొందరికి మోదం – మరికొందరికి ఖేదం' అనే విధంగా ఉండకూడదు. పాఠశాల విద్య కోసం ప్రభుత్వం ఖర్చు పెడుతున్న వేల కోట్ల రూపాయలు నిజానికి ఎవరికి ఉపయోగపడుతున్నాయి?.. సర్కారీ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు మంచి ప్రమాణాల విద్యను అందించడానికి ఈ డబ్బు పనికొస్తోందా? లేక మంచి జీతాల పేరుతో టీచర్లను సంతృప్తిపరచడానికి పనికొస్తోందా? అనేది నేడు చర్చనీయాంశం. టీచర్లకు మంచి జీతాలు ఇవ్వొద్దనడం మన ఉద్దేశం కాదు. వారికి ఏ ఉద్దేశంతో మంచి జీతాలు ఇస్తున్నామో ఆ ఉద్దేశం ఎంతవరకు నెరవేరుతుందనేదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.

పేద పిల్లల్లో ఉండే ప్రతిభకు సానపట్టి, కాన్వెంట్లలో చదువుకుంటున్న సంపన్న వర్గాల పిల్లలతో సమానస్థాయిలో పోటీపడి మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకునేలా తయారుచేయడం ప్రభుత్వ విద్య ముఖ్యోద్దేశం అనుకుంటే అది ఎంతవరకు నెరవేరుతోంది? గమ్యాన్ని చేరలేక మధ్యలోనే 'డ్రాపవుట్' అయిపోతోంది. టీచర్ల జీతాలు, మధ్యాహ్న భోజనం, టాయిలెట్లు, ప్రహరీ గోడలు, మంచినీళ్లు, కంప్యూటర్లు ఇవన్నీ కూడా చదువు కోసమే. అసలు చదువే రానప్పుడు వీటన్నింటి గూర్చి మాట్లాడుకోవడం వల్ల ఏమి ప్రయోజనం? వీటి గూర్చి ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నామని చెప్పుకోవడం వల్ల ఒరిగేదేమి? 'పిల్లలకు చదువెంత వస్తోంది? ఏ మేరకు నేర్చుకోగలుగుతున్నారు' అనే విషయాలను పరిశీలించుకోకపోతే ఎంత ఖర్చు పెడితే ఏం లాభం? అసలు పేద పిల్లలకు మంచి విద్యను అందించాలనే చిత్తశుద్ధి ఉంటే ఎందుకు పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయరు? ఎందుకు సమీక్షలు జరపరు? పేదల పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో మంచి ప్రమాణాల విద్య అందకూడదు అని పాలక వర్గాలు ఒట్టు పెట్టుకుని మరీ పనిచేస్తున్నాయి. పై వివరాల ద్వారా ఇది సుస్పష్టం.

మంచి చదువు అందుతుందనే గ్యారంటీ ఉంటే మిగతా సౌకర్యాల గూర్చి పట్టించుకోకుండా కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతారు. ముందు ఆ గ్యారంటీయే లేకుండా, ఎన్ని చేసినా చేరరు. ఉదాహరణకి నేను హైదరాబాద్ నుంచి వరంగల్‌కి వెళ్లాలి. వరంగల్ చేరుకోవడం నా ముఖ్య ఉద్దేశం. నాకు అందుబాటులో కేవలం రెండు బస్సులు మాత్రమే ఉన్నాయి. మొదటి బస్సు వరంగల్‌కి వెళ్తుందనే బోర్డుతో బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. కానీ దాంట్లో హాయిగా కూర్చొని ప్రయాణించడానికి సీటు కూడా లేదు. రెండవ బస్సు ఉంది. దాంట్లో అన్ని సీట్లూ ఖాళీగా ఉన్నాయి. బోర్డు లేదు, కనీసం ఏ గమ్యస్థానానికి చేర్చుతారో కూడా చెప్పడం లేదు. కానీ మీకు మధ్యలో భోజనం పెడతాం, సీట్లు ఖాళీగా వున్నాయి, మా బస్సులో టాయిలెట్ సౌకర్యం కూడా ఉంది అని చెబుతున్నారు. నా గమ్యస్థానం వరంగల్ అయినపుడు, ఎంత అసౌకర్యం, ఎంత వ్యయం అయినా సరే భరించి గమ్యస్థానాన్ని చేర్చే మొదటి బస్సును ఎక్కుతాను తప్ప సౌకర్యాల గురించి ఆలోచించి ఎటువెళ్తుందో తెలియని రెండవ బస్సు ఎక్కను. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల విషయంలో జరుగుతున్నది ఇదే. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే తమ పిల్లలకు మార్కెట్‌లో పనికొచ్చే విద్య అందుతుంది అనుకుంటే అందరి పిల్లలనీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేవారు. ఐదుగురు, పదిమంది పిల్లలతో పాఠశాలల్ని నడిపించే దుస్థితి వచ్చేది కాదు. రెండు తెలుగు రాష్ట్రాలలో 10మంది మాత్రమే ఉన్న పాఠశాలలు 10వేల వరకు ఉన్నాయని అంచనా. ఉమ్మడి రాష్ట్ర లెక్కల ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం (ప్రభుత్వ, ప్రయివేటు) పాఠశాలలు 1లక్షా నాలుగువేలు ఉంటే, అందులో దాదాపు 75వేలు సర్కారీ బడులు. మొత్తం పాఠశాల విద్య చదువుతున్న కోటి మంది విద్యార్థుల్లో సగానికిపైగా ప్రయివేటులోనే చదువుతున్నట్టు, విద్యాహక్కు చట్టం వచ్చాక ఈ సంఖ్య ఇంకా వేగంగా పెరుగుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. మార్కెట్ నైపుణ్యాలే కాదు.. కనీసం వ్యక్తిత్వాన్ని, సామాజిక పరిజ్ఞానాన్నయినా అందించే ప్రయత్నం సర్కారీ బడుల్లో జరగటం లేదు. అటు ప్రయివేటు స్కూళ్లలోనూ ర్యాంకుల రుబ్బుడే తప్ప నిజమైన చదువు, సమాజానికి పనికొచ్చే పౌరసత్వ బోధన అందటం లేదు.

ఇంత అరాచకంగా, అస్తవ్యస్తంగా, అవ్యవస్థీకృతంగా మన తెలుగు రాష్ట్రాల్లో విద్యావ్యవస్థ నడుస్తుంటే దాని గురించి ఒక్క లోక్‌సత్తా తప్ప మరెవ్వరూ సమగ్రంగా, నిర్దిష్ట పరిష్కారాల

దిశగా మాట్లాడరు. ఈ స్వంత మీడియాల యుగంలో లోక్‌సత్తా వేదన చాలా సందర్భాలలో అరణ్యరోదనే అవుతోంది. సోషల్ మీడియాకు కూడా కొన్ని పరిమితులుండటం వల్ల అనుకున్న స్థాయిలో పరిష్కారాలను ప్రజలకు ఇంకా అందించ లేకపోతున్నాం. పనికొచ్చే విషయాలకు మీడియా ఎప్పుడైతే ప్రాధాన్యత ఇస్తుందో, అప్పుడు మాత్రమే మార్పునకు అవకాశం ఉంటుంది. అన్నింటికంటే ముందు 'విద్య అనేది ప్రభుత్వానికి ముఖ్యమైన విషయమా, కాదా' అనేది తేల్చుకోవాలి. ముఖ్యమైన విషయమైతే ప్రభుత్వ ప్రాథమ్యాలలో ఏ స్థానంలో ఉంది? ప్రాధాన్యతాంశం అయితే.. ఎందుకు ఇంత అస్తవ్యస్తంగా ఉంది? విద్య అనేది సమాజంలో ఎందుకు విస్తృతమైన చర్చకు రావడం లేదు? కవులు, కళాకారులు, సామాజికవేత్తలు, రాజకీయ పక్షాలు, పౌరసమాజం ఎందుకని పనికొచ్చే నాణ్యమైన విద్య కోసం పోరాడటం లేదు?– ఇవన్నీ కూడా చర్చనీయాంశాలు.

### పరిష్కారం- స్కూల్ ఛాయిస్

సమస్య గురించి మాట్లాడటం తేలికైన పని. కానీ సమస్యకు పరిష్కారం కనుగొనే దిశగా ప్రయత్నించటం ప్రధానంగా చేయాల్సిన పని. ఈ పనిని లోక్‌సత్తా గత 20 ఏళ్లుగా చేస్తోంది. కానీ ఏనాడూ కూడా తాము సూచించిన పరిష్కారాలు మాత్రమే 100శాతం సరైనవి అనే పిడివాదాన్ని చేయలేదు. ఏదిఏమైనా సమస్య గురించి చర్చ జరగడం అవసరం.


ఉదాహరణకు తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యకు చేసే కేటాయింపుల ద్వారా ఏటా ఒకొక్క విద్యార్థి మీద తలసరి రూ.40వేలు ఖర్చు చేస్తోంది. ఇది చాలా ప్రయివేటు పాఠశాలల్లో ఒక సంవత్సర కాలానికి తీసుకునే ఫీజు కంటే ఎక్కువ. రూ.40వేలు ఖర్చు పెట్టి మార్కెట్‌లో పనికిరాని చదువును పొందే బదులుగా.. పిల్లల తల్లిదండ్రులకు స్కూల్ ఛాయిస్ ఇస్తే బాగుండదా? అంటే ఆ తలసరి 40వేలను పేద పిల్లల తల్లిదండ్రులకు ఓచర్ రూపంలో ప్రభుత్వం ఇవ్వాలి (అది ఏ స్కూల్‌లోనైనా చెల్లే విధంగా ఉండాలి). వారి ఇష్టం వచ్చిన స్కూల్‌లో తమ పిల్లల్ని చదివించుకునే వెసులుబాటు కల్పించాలి. ఈ పద్ధతిని ప్రవేశపెడితే అందరూ ప్రయివేటు ఇంగ్లిష్ మీడియం స్కూళ్లకి వెళతారు కదా, అప్పుడు ప్రభుత్వ పాఠశాలలు మూతపడిపోతాయి కదా, ప్రభుత్వ టీచర్లకు జీతాలు ఎట్లా.. అనే ప్రశ్నలు సహజంగా ఉత్పన్నమవుతాయి. ఏమీ మూతపడాల్సిన అవసరం లేదు. ఒకవేళ ఈ పోటీ చూసి ప్రభుత్వ స్కూళ్లలో చదువులు బాగుపడితే విద్యార్థులు పెరిగి వారికి జీతాలు పెరుగుతాయి. విద్యార్థులు తగ్గితే మాత్రం వారికి జీతాలు తగ్గుతాయి. కాబట్టి విద్యార్థులు తగ్గకుండా ఉండేలా/పెరిగేలా చూసుకోవాలి. ఇదే పరిష్కారాన్ని ఇంకొంచెం విస్తరించి కూడా అమలుచేసుకోవచ్చు. ఇప్పుడున్న ప్రభుత్వ పాఠశాలల భవనాలను అద్దె లేకుండా ఉచితంగా ప్రభుత్వ టీచర్లకు ఇవ్వాలి. ఇందుకోసం ఆ టీచర్లు సొసైటీలుగా ఏర్పడాల్సుంటుంది. వాళ్లు బాగా చదువు చెబితే, ఓచర్లు పట్టుకుని ప్రజలు వాళ్ల దగ్గరికే వస్తారు. అలా వచ్చిన డబ్బుని వారు జీతాలుగా పంచుకోవచ్చు. ఈ విధమైన ఆరోగ్యకర పోటీని నెలకొల్పడం ద్వారా అందరికీ నాణ్యమైన, పనికొచ్చే విద్యని అందించి, సమానావకాశాలను కల్పించవచ్చు.

పై వాదాన్ని చాలామంది వ్యతిరేకిస్తారు. మీరు కార్పొరేటు, ప్రయివేటు శక్తులకు కొమ్ముకాస్తున్నారు, ప్రభుత్వోద్యోగుల ఉద్యోగభద్రతకు వ్యతిరేకం లాంటి విమర్శలు వస్తాయి.. మాకు కూడా ప్రభుత్వ విద్యావ్యవస్థను, ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రభుత్వ ఉపాధ్యాయుల చేతే మంచి విద్యను అందిస్తే బాగుండు అనిపిస్తుంది. కానీ అనుభవం నేర్పుతున్న పాఠాలను గమనించాలి. సంఘటితమై, యూనియన్లుగా ఏర్పడి ప్రభుత్వాలనే శాసించే స్థాయిలో వున్న ఉపాధ్యాయులు ఒళ్లు వంచి పనిచేసే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోగలుగుతున్నాయా? ఇందుకు తగ్గ ప్రణాళిక పాలకుల వద్ద ఏముంది? ఏమీ లేదనే చెప్పాలి. అందుకోసమే పైన పేర్కొన్న పోటీ వ్యవస్థను సూచిస్తున్నాము. అద్భుతంగా పాఠాలు చెబుతూ పిల్లల గురించి పట్టించుకునే ప్రభుత్వ ఉపాధ్యాయులు చాలామంది ఉన్నారు. గుర్రాన్ని, గాడిదను ఒకే గాటికి కట్టేయడం వల్ల వాళ్లకి ప్రోత్సాహం లేకుండా పోయింది. ప్రభుత్వ స్కూళ్లు గనక స్కూల్ ఛాయిస్ పోటీలో నెగ్గితే దానంతటదే ప్రభుత్వ విద్య తిరిగి పుంజుకుని విస్తరిస్తుంది.

ఏది ఏమైనా నాణ్యమైన, పనికొచ్చే విద్య మీద చర్చ జరగాలనే ఉద్దేశంతో విద్యార్థిసత్తా రానున్న రోజుల్లో అనేక కార్యక్రమాలను చేయబోతోంది. ఇటీవల యూత్ పార్లమెంట్‌ల్ని నిర్వహించాం. మంచి స్పందన వచ్చింది. అదే స్ఫూర్తితో ఇంకా చేయబోతున్నాం.

జై లోక్‌సత్తా, జై విద్యార్థిసత్తా ❍

# జస్టిస్ కట్జూకి నోటీసివ్వటం స్వేచ్ఛను సుప్రీంకోర్టే కాలరాయటం: జేపీ




న్యాయవ్యవస్థపై మితిమీరి మాట్లాడారంటూ మాజీ న్యాయమూర్తి జస్టిస్ కట్జూకి సుప్రీంకోర్టు తాఖీదు ఇవ్వటాన్ని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తీవ్రంగా ఆక్షేపించారు.

కేరళకు చెందిన సౌమ్య అత్యాచారం, హత్య కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులో ప్రాథమిక దోషాలున్నాయని కట్జూ చేసిన వ్యాఖ్యలపై న్యాయస్థానం సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ధర్మాసనం, కట్జూ మధ్య ఇటీవల తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. తమకు ఎదురు మాట్లాడటాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు కట్జూకి కోర్టు ధిక్కార నోటీసుని ఇచ్చింది.

ఈ నోటీసు అవాంఛనీయమైందని, ప్రతికూల ఫలితాలనిస్తుందని జేపీ స్పష్టం చేశారు. న్యాయస్థానానికి దురుద్దేశం, అవినీతి వంటివి ఆపాదిస్తే కోర్టు ధిక్కారమవుతుందిగానీ.. కాస్త దుందుడుకుగా ఉన్నా నిష్పాక్షికంగా చేసిన విమర్శలు కోర్టు ధిక్కారం కాదని స్పష్టం చేశారు.

సుప్రీంకోర్టు తీర్పులు అన్ని కోర్టులకూ మార్గదర్శకాలని, అయితే జడ్జీలు దేవుళ్లో, ఎన్నడూ తప్పుచేయని వారో కాదని గుర్తుంచుకోవాలని జేపీ అన్నారు. 'నీట్' కేసులో సుప్రీంకోర్టు స్వయంగా తన తప్పుల్ని ఒప్పుకుని తీర్పుని వెనక్కితీసుకుందని గుర్తుచేశారు. "మనం పొరపాటు పడే అవకాశముంది" అని న్యాయమూర్తులు సహ అధికారంలో ఉన్నవారంతా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నిజాయతీతో కూడిన విమర్శను, విశ్లేషణను శిక్షించాలనుకోవటం ద్వారా కోర్టు ప్రజలకున్న భావప్రకటనా స్వాతంత్ర్యాన్ని, తన విశ్వసనీయతను కూడా దెబ్బతీసుకుంటోందని అన్నారు. భావప్రకటనా స్వేచ్ఛ అంటే ఇతరులు మన అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నారా లేదా అని కాదన్నారు. సుప్రీంకోర్టు తనకుతానే శత్రువుగా మారకూడదన్నారు.

మనతో విభేదించేవారందరినీ దోషులనటం వల్ల స్వేచ్ఛ ప్రమాదంలో పడుతుందని, అందరి భావప్రకటనా స్వేచ్ఛ, ఇతర రాజ్యాంగ హక్కులకు గ్యారంటీనిస్తూ దేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా సుప్రీంకోర్టు విశ్వసనీయతతో, సామర్థ్యంతో పనిచేయడం కోసమే తమ సంస్కరణల పోరాటమని అని జయప్రకాష్ నారాయణ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ❍

# ప్రియమైన పవన్ కళ్యాణ్ గార్కి..

మీరు కిందటి ఎలక్షన్లలో హైదరాబాద్ మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసిన లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్ గార్కి ప్రచారం చేస్తానని పబ్లిగ్గా ప్రకటించి, ఆ తరువాత మీ ప్రకటనను మీరే అమలు చేయలేదు. చూడండి.. ఒకప్పటి మీ స్నేహితులయిన చంద్రబాబు నాయుడు, మోదీగార్ని ఇప్పుడు ప్రజల తరపున మీరే ప్రశ్నిస్తున్నారు. అది మంచిదే. కానీ ఈ ప్రశ్నలను మరింత గట్టిగా, మంచి అవగాహనతో కూడిన ప్రణాళికతో అడగగలిగే, ప్రజల వాణిని, సమస్యలను చట్టసభలలో వినిపించగలిగే అవకాశం 2014లో జయప్రకాష్ గారి చేయిజారిపోయింది. ఆనాడే మీరు గట్టిగా ప్రయత్నించి ఉంటే, ఈనాడు ఎంపీ హోదాలో జేపీ పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున– అది రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదాగానీ, పోలవరం విషయంగానీ, రాజధాని నిర్మాణం గురించిగానీ, మరే ఇతర అంశంపైనగానీ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయగలిగేవారు. దేశం, రాష్ట్రాలు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారాలు కనుగొనే ప్రక్రియలో ఆయనది దశాబ్దాల అసాధారణ కృషి, నైపుణ్యం, చిత్తశుద్ధి. ఈనాడు మనకున్న ఎంపీలలో అత్యధికులు స్వార్థపూరిత రాజకీయాలు నడిపేవారే. ఈ విషయం ప్రధానమంత్రి స్వయంగా వెల్లడించారు (రూ. 2లక్షలకు పైబడిన బంగారం కొనుగోలుపై 'పాన్' కార్డు తప్పనిసరి చేయటంపై).

ఓటర్లకు డబ్బు పంపిణీ చేయనందున జేపీ గెలుపునకు దూరమయ్యారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డబ్బులు బాగా పంపిణీ చేసి ఎంపీగా గెలిచి ఆ తరువాత టీఆర్ఎస్ పార్టీలో చేరిపోయారు. పరిజ్ఞానం, సమర్థత గల రాజకీయ నాయకులకు ఓట్లు వేసేలా చేయటం దేశ ప్రయోజనాలకు చాలా ముఖ్యం.

ఒక రాజకీయ పార్టీకి, అందులోనూ కొత్తగా వచ్చే వాటికి ప్రజలు, ప్రజల ఓట్లతోపాటు సమస్యలపై అవగాహన, వాటికి పరిష్కారాలు చూపించగల నాయకులు చాలా అవసరం. రాజకీయ పార్టీలలో వివిధ రకాల వర్గాలు, మనుషులు సహజం. కొందరు బాగా ఉపన్యసించి మనుషుల్ని ఆకట్టుకోగలరు. కొందరు డబ్బు బాగా కలిగివుంటారు. కొందరు దూరదృష్టితో వాస్తవాలు గ్రహించి మంచి సూచనలు ఇవ్వగలరు. కేవలం దూరదృష్టిగల మెరుగైన విధానాలను రూపొందించటానికే దేశాలు వేల కోట్లు ఖర్చు చేస్తుంటాయని, అవి ఫలితాలనిస్తే



దేశానికి లక్షలకోట్ల ఆదాయం, ప్రజలకు తరతరాలపాటు భద్రతతో కూడిన భవిష్యత్తు లభిస్తాయని గుర్తించాలి. మీరు పబ్లిక్ మీటింగులలో జనాలను ఆకర్షించి బాగా మాట్లాడగలరు. జేపీ చట్టసభలలో బాగా మాట్లాడగలరు.

ఏది ఏమయినా, సమాజాన్ని వృద్ధిపథంలో నడిపేందుకు అందరి భాగస్వామ్యమూ అవసరమవుతుంది. వివిధ రాజకీయ పార్టీలలో అభిప్రాయ భేదాలుండొచ్చు. కానీ ప్రజల సమస్యలపై పోరాడేందుకు భావ సారూప్య (లైక్ మైండెడ్) ప్రజాప్రతినిధులతో సంయుక్తంగా ఉద్యమించటం ఉత్తమం. ఎలక్షన్లలో పాల్గనటం అంటే తప్పనిసరిగా ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి అయిపోనవసరం లేదు. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయా, లేదా? ఎక్కడైనా అవినీతికి పాల్పడుతున్నాయా? వారిచ్చిన వాగ్దానాలను అమలు చేస్తున్నాయా, లేదా? ప్రజల పన్నుల డబ్బును సరైన దిశలో ప్రజలకోసమే ఖర్చు చేస్తున్నాయా, లేదా?.. అని పర్యవేక్షించటం చాలా అవసరం. ఎన్నికల్లో జయాపజయాల మీద ఆధారపడేకంటే.. నిత్యం ప్రజాసమస్యలపై వివిధ రాజకీయ పార్టీలతో, సంఘాలు, వ్యక్తులు, ఉద్యమాలతో కలిసి పనిచేయటం, ప్రజల్ని ఆలోచింపచేస్తూ చైతన్యపరచటం, అభివృద్ధి నిరోధక శక్తుల్ని మట్టికరిపించటం జరగాలి. ఈ ప్రక్రియల ద్వారా ఎన్నికలలో పాల్గనే నాటికి కొంత అవగాహన అందరికీ వస్తుంది. కలిసికట్టుగా పోరాడితే విజయం తథ్యం. చిత్తశుద్ధి కలిగివుండే వారికి ఎన్నికలలో అవకాశం కల్పించాలి. నేరస్తులకు అసలు అవకాశం ఇవ్వకూడదు.

ప్రేమతో

డా॥ వంక వెంకట రామదాస్,
పీపుల్స్ నర్సింగ్ హోమ్, తణుకు






భారతదేశంలో ఉదారవాద ఆలోచనపై సెంటర్ ఫర్ సివిల్ సొసైటీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన చర్చా కార్యక్రమంలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. 'స్వేచ్ఛకి మూలస్తంభం స్థానిక స్వయంపాలన' అనే అంశాన్ని.... 5,000 ఏళ్ల భారతీయ నాగరికత, సంస్కృతీసంప్రదాయాలు, గణతంత్ర వ్యవస్థకు పునాది వేయటంలో బలమైన స్థానిక ప్రభుత్వాల పాత్రను అభివృద్ధి చెందిన దేశాల అనుభవాలతోపాటు ఉటంకిస్తూ జేపీ వివరించారు.

Posting Date 07-12-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on December 1st 2016

# నిజాలు మాట్లాడుకుందాం-10




**మన దేశంలో ప్రతి ఏడాది దాదాపు 1.2 కోట్ల మంది చదువు పూర్తి చేసి ఉద్యోగాల కోసం చూస్తున్నారు.**

**అయితే గత 20 ఏళ్ళలో మన పాలకులు 20 లక్షల ఉద్యోగాలు మాత్రమే కల్పించారు.ఇదే సమయంలో చైనాలో 20 కోట్ల ఉద్యోగాలు కల్పించబడ్డాయి.**

షేర్ చేయండి . ప్రజలకు నిజాలు చేరవేయండి

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad